

14 శాతం ఖాళీ...

- ఇంజినీరింగ్‌లో మిగిలిపోయిన సీట్లు
- అత్యధికంగా అశోకాలో 99.65 శాతం సీట్లు భర్తీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని ఇంజినీరింగ్ సీట్లలో 14 శాతం సీట్లు భర్తీ కాలేదు. 85.97 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. భర్తీ అయిన వాటిలో అత్యధికంగా కర్నూలులోని అశోకా ఇంజినీరింగ్ కళాశాలలో 99.65 శాతం సీట్లు భర్తీ అయ్యాయి..

రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఇటీవల ప్రత్యేక ఫేస్ భర్తీ కార్యక్రమం చేపట్టింది. అది పూర్తయిన తరువాత కూడా సీట్లు భర్తీ కాకుండా ఖాళీగా ఉండిపోయాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 12 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో కన్వీనర్ కోటా కింద మొత్తం 5,064 సీట్లు ఉన్నాయి. ప్రత్యేక ఫేస్ భర్తీ తరువాత 4,354 సీట్లు భర్తీ అయ్యాయి. మిగతా 710 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. అంటే 14.03 శాతం ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. అత్యధికంగా కర్నూలులోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 99.65 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. తరువాత జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 99.42 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 99.31 సీట్లు, శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో 93.45 సీట్లు, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో 89.73 శాతం సీట్లు, నంద్యాల ఆర్‌జిఎం కళాశాలలో 82.57 శాతం సీట్లు, సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 80.65 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఎస్‌విఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 80.21 శాతం సీట్లు, డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 73.84 శాతం సీట్లు, రాయలసీమ యూనివర్సిటీ సెల్ఫ్ ఫైనాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో 48.86 శాతం, బృందావన్ ఇంజినీరింగ్ కళాశాలలో 42.71 శాతం సీట్లు, భీమా ఇంజినీరింగ్ కళాశాలలో 42.50 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

కళాశాల వారీగా సీట్ల ఖాళీలు ఇలా..

కళాశాల	ఖాళీ సీట్లు	కళాశాల	ఖాళీ సీట్లు
అశోకా	01	ఎస్‌విఆర్	76
జి.పుల్లారెడ్డి	05	కెవి సుబ్బారెడ్డి	113
రవీంద్ర	02	ఆర్‌యు	135
శాంతిరామ్	22	బృందావన్	165
జి.పుల్లయ్య	69	భీమా	138
ఆర్‌జిఎం	159		
సెయింట్ జాన్స్	65	మొత్తం	710

11వ వార్డులో
చెత్త కుప్పలను తొలగించాలి

- సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎర్ర బురుజులోని హాజిరా కాలేజీ ప్రక్కన వున్న చెత్త కుప్పను తొలిగించాలని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజ శేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముహమ్మద్ షరీఫ్‌లు నగరపాలక సంస్థ అధికారులకు డిమాండ్ చేశారు. గత ఆదివారం నుండి సిపిఎం అన్ని వార్డులలో పర్యటిస్తుందని, ఏ వార్డు లో చూసినా అంతా చత్త మయమని అన్నారు. కర్నూలుకు స్వచ్ఛతపై అవార్డు వచ్చిందని సంతోష పడాలా లేక నగరం మొత్తం చెత్తతో అస్తవ్యవస్థంగా ఉన్నందుకు బాధపడాలా నగర కమిషనర్ తెలుపాలన్నారు. నగర ప్రజల ఆరోగ్యం పట్ల నగర పాలక కమిషనర్ కి సిబ్బందికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థ కమిషనర్ సిబ్బంది, చెత్త పన్ను చెల్లించలేదనే నెపంతో లక్ష్మీనగర్ లో ఒక ఇంటికి అడ్డంగా ఆటో పెట్టించిన ఘనత మన పాలక వర్గందని ఘాటుగా విమర్శించారు. తక్షణం నగర పాలక మండలి కార్పొరేటర్లు ,మేయర్, ప్రజా ప్రతినిధులు అందరూ కలిసి నగరంలో విస్తరించి ఉన్న చెత్తను, కాలువల శుభ్రపరచి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక అజెండా పెట్టి నగర కౌన్సిల్ సమావేశం జరపాలని డిమాండ్ చేశారు. ఈ వార్డు పర్యటనలో గనిఖాన్, బజారి, వేణు, తిరుపాల్, మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



వార్డులో అపరిశుభ్రతను పరిశీలిస్తున్న నాయకులు

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు

- కలెక్టర్ కోటేశ్వరరావు
- మహిళలపై లైంగిక వేధింపులు, హింస, వివక్ష, వ్యతిరేకత నిర్మూలనపై జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.కోటేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 'మహిళలు పని చేసే చోట వారిపై జరిగే లైంగిక వేధింపులు, హింస, వివక్ష, వ్యతిరేకత నిర్మూలన'పై జిల్లాస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పి.కోటేశ్వర రావు, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ కుమారి, లైంగిక వేధింపులు కమిటీ ఛైర్మన్ డాక్టర్ మాధవి శ్యామల, డాక్టర్ ఉమా, మెప్మా పీడీ వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. లైంగిక వేధింపుల చట్టం-2013ను భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని తెలిపారు. మహిళలు పని చేసే ప్రదేశాల్లో వారు ఎదుర్కొంటున్న లైంగిక సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా, మండల, గ్రామ, రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు రక్షణే కాక ఒకరి నుంచి ఒకరికి రక్షణ అవసరం అని తెలిపారు. స్త్రీలు స్వయం సహాయ, సహకార సంఘాల ద్వారా ఎన్నో పథకాలను ఉపయోగించుకొని ఆర్థికంగా ముందుకు రాణిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం స్త్రీలను ప్రోత్సహించేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. ఉద్యోగుల్లో కూడా 50 శాతం వరకు మహిళ ఉద్యోగులు ఉండడం శుభ పరిణామమని చెప్పారు. మనుషుల్లో ఉన్న ఆత్మనూన్యత భావాన్ని తొలగించాలని అన్ని ప్రభుత్వ పథకాల లబ్ధిని స్త్రీలకు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ మాట్లాడారు. స్త్రీలపై హింసలు జరగకూడదనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలు, స్త్రీలలో చైతన్యం నింపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. హింస లేకుండా సమానత్వం కూడిన సమాజాన్ని నిర్మించుకోవడం కోసం ప్రతి స్కూలు, కాలేజ్, ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడానికి ఎన్నో పథకాలు రూపొందించారన్నారు. స్త్రీలు రాజకీయంగా ఎదగడానికి కూడా 50 శాతం రిజర్వేషన్ కల్పించినట్లు తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ సంజీవ్ కుమార్

నేర నివారణకు గట్టిగా పని చేయండి

- పెండింగ్ చార్జీషీట్లు వారంలోపు పూర్తి చేయండి
- ఎస్పి సిద్ధార్థ్ కౌశల్ - జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి- కర్నూలు క్రైం

నేరాల నివారణకు అందరూ గట్టిగా పని చేయాలని జిల్లా ఎస్పి సిద్ధార్థ్ కౌశల్ పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎఐలతో జిల్లా ఎస్పి సమీక్షా సమావేశం నిర్వహించారు. బాధ్యతగా పని చేసి పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించాలన్నారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్ లోని పెండింగ్ కేసుల గురించి సమీక్షించారు. పెట్రోలింగ్ వాహనాలతో రాత్రి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. గస్తీని డిఎస్‌పి స్థాయి అధికారులు పర్యవేక్షించాలన్నారు. అసాంఘిక కార్యకలపాలు జరగకుండా చూడాలన్నారు. లోక్ అదాలత్‌లో అందరూ బాగా పని చేశారన్నారు. రాష్ట్రంలోని జిల్లాలతో పోలీస్తే అనంతపురం, తర్వాత కర్నూలు జిల్లానే బెస్ట్‌గా ఉందన్నారు. వారంలోపు పెండింగ్‌లో ఉన్న వాటికి వెంటనే చార్జీ షీట్లు ఫైల్ చేసి కోర్టుకు అందజేయాలన్నారు. చార్జీషీట్లు ఫైల్ చేసిన వాటికి దాదాపు 2000 పైన కోర్టుల నుండి సిసి నెంబర్స్ రావాలన్నారు. సిసి నెంబర్ల కొరకు ఆయా కోర్టుల జడ్జీలను కలిశామన్నారు. పెండింగులో ఉన్న కేసుల గురించి పోలీసుస్టేషన్ల వారీగా పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐదు వారాల్లో 2022 సంవత్సరం ముగిసిపోతుందని , ఇయర్ ఎండింగ్ లోపు పెండింగ్ కేసులు బాగా తగ్గించాలన్నారు. చాలా ఏళ్లుగా కొన్ని పోలీసుస్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య తగ్గితే జిల్లా మొత్తం మీద ఆ భారం తగ్గుతుందన్నారు. రికవరీలు బాగా చేయాలన్నారు. పెండింగులో ఉన్న చిన్న, చిన్న కేసులు పరిష్కారమయ్యే దిశగా చూడాలన్నారు. ఎస్‌జిడి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రతి శాఖకు ఇచ్చారన్నారు. సిఎం ఆఫీసు నుండి మానిటర్ చేస్తున్నారని, పోలీసులు దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి జిగ్ జాగ్ రేడియంతో బారీకేడ్స్‌ను ఏర్పాటు చేయించాలన్నారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి.ప్రసాద్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్‌పిలు వెంకటాద్రి, వెంకట్రామయ్య, యుగంధర్ బాబు, వినోద్ కుమార్, నాగభూషణం, శ్రీనివాసులు, కెవి మహేష్, డిపిఓ ఎఒ సురేష్ బాబు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పి



సమావేశానికి హాజరయిన అధికారులు

అద్దె బస్సులు వద్దు.. కొత్త బస్సులు ముద్దు

- ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి డిపోల ఎదుట ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌ఆర్‌టిసిలో అద్దె బస్సులను ప్రోత్సహించకుండా కొత్త బస్సులను కొనుగోలు చేసి సంస్థకు ఆదాయాన్ని చేకూర్చాలని ఎస్బ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సంజీవరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు కర్నూలు వన్‌అండ్‌టు డిపోల ఎదుట రీజినల్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు ఎస్‌ఆర్‌కె. రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈధర్నాలను ఉద్దేశించి జిల్లా కార్యదర్శి వి.సంజీవరాయుడు మాట్లాడారు. కార్మికులకు ఉద్యోగులకు రావలసిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2017 ,2018, 2019 సంవత్సరపు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించడానికి ఆర్‌టిసి యాజమాన్యం పూనుకోవాలన్నారు. ఇప్పటికే సెలవులు కోత పెట్టిన 2020 , 2021 వ సంవత్సరం లీవ్ ఎన్‌క్యాస్‌మెంట్‌ను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలలో అద్దె బస్సులను ప్రవేశపెట్టి రెగ్యులర్ కార్మికులను ఎక్సెస్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వంలో విలీనం తర్వాత మూడేళ్లుగా ఉద్యోగ కార్మికులకు ఎలాంటి అలవెన్సులు చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు. రిక్రూట్మెంట్ లేకుండా కొత్త బస్సులు కొనకుండా ప్రైవేటీకరణ వైపు చర్యలు తీసుకోవడం సమంజసం కాదని అన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి వివిఎస్. రాయుడు, కోశాధికారి ఎస్‌ఆర్‌కె.రెడ్డి, కర్నూలు 1,2 డిపోల కార్యదర్శులు హనుమంత రెడ్డి, ఎ.దేవరాజు, రీజనల్ నాయకులు కెసి.శేఖర్, బి.నాగరాజు, ఆర్‌ఎల్. నాయుడు, మునిస్వామి పాల్గొన్నారు. ఈ రెండు డిపోలలో జరిగిన ధర్నాలో ఉద్యోగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరికీ ఎస్‌డబ్ల్యుఎఫ్ ధన్యవాదాలు తెలిపారు.



ఆర్‌టిసి డిపో ముందు ధర్నా చేపడుతున్న నాయకులు



జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

అట్ట హాసంగా జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలు ప్రారంభం


ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

క్రీడాకారులు పోటీలో చక్కటి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎంఎ.హాఫీజ్ ఖాన్ సూచించారు. ఐదురోజుల పాటు నిర్వహించే పోటీలను శుక్రవారం కర్నూలు ఎ.కాంప్ మోంటిస్సోరి స్కూలులో 35వ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా తీసుకుని పోటీల్లో పాల్గొనాలని కోరారు. గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో రాణించాలన్నారు. సాఫ్ట్ బాల్ సంఘం భారత కార్యదర్శి ఎల్ఆర్.మౌర్య మాట్లాడుతూ దేశంలోని 22 రాష్ట్రాల నుంచి ఈ ఫోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. క్రీడాకారుల కొరకు భోజన వసతులను ఏర్పాటు చేసిన రాష్ట్ర, జిల్లా సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు క్రీడాకారులు చేసిన మార్చిపాస్ట్‌కు అతిథులు గౌరవం వందనం చేశారు. కార్యక్రమంలో క్రీడా శాఖ సిఇఒ రమణ , మోంటిస్సోరి పాఠశాల అధినేత కెఎస్‌వి రాజశేఖర్ , కార్యదర్శి నాగేంద్ర , జిల్లా అధ్యక్ష , కార్యదర్శి లు చంద్రశేఖర్ , విజయ్ కుమార్ , పోటీల ఆర్గనైజర్ జాకీర్ , పలువురు జాతీయ మెనేజర్లు , జాతీయ కోచ్ లు రెఫ్రీ లు పోటీలను పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు చూపరులను కనువిందు చేశాయి.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

టిడిపి కర్నూలు ఇన్‌ఛార్జి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో రాణించాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జీ టిజి భరత్ క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని మౌర్య ఇన్ లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన క్రీడాకారులు టిజి భరత్‌ను కలిశారు. వారిని ఆయన అభినందించారు. తైక్వాండో క్రీడలో కర్నూలుకు చెందిన క్రీడాకారులు రాణించడం శుభపరిణామం అన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి పతకాలు సాధించాలని ప్రోత్సహించారు. క్రీడాకారులకు అవసరమైన సహకారం తమ నుండి ఎప్పుడూ ఉంటుందని భరత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, వీరేశ్ రావ్, నాగరాజు, భార్గవ్, మల్లేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛఆంధ్ర క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్నటువంటి స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ క్లాప్ డ్రైవర్స్, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు సిఐటియు నగర నాయకులు అబ్దుల్ దేశాయి అధ్యక్షతన నిరసన తెలిపారు. క్లాబ్ డ్రైవర్ కార్మికుల ఉద్దేశించి సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి మారెళ్ళ (రామాంజనేయులు) విజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పేరుతో ప్రజలు వినియోగించిన వేస్ట్ చెత్తను వీధులలో , మురుగు కాలువల్లో వేయకుండా ప్రజల నివాసాల నుండి చెత్తను సేకరించి ఆటోల ద్వారా కంపోస్టు యార్డు కు తరలించడంఈ డ్రైవరలన్నల పని అన్నారు. ఈ స్కీంను థర్డ్ పార్టీ ఏజెన్సీ అయినా రెడ్డి ఎంటర్‌ప్రైజెస్‌తో రాష్ట్ర ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకుని బాధ్యతలు అప్పజెప్పిందన్నారు. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏజెన్సీల ద్వారా చాలా నష్టపోతున్నారని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏ ఒక్క కార్మికుడు నష్టపోకుండా, ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి సమాన పనికి సమాన వేతనం, పని భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ఏజెన్సీలను రద్దు చేయకపోగా వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వని దుస్థితి ఏర్పడిందన్నారు. సిఎం అనుయాయుల కోసం కొత్త ఏజెన్సీలు పెట్టుకోవడానికి అవకాశం కల్పించి రాష్ట్రాన్ని దోచి పెడుతున్నారన్నారు. క్లాప్ డ్రైవర్‌లకు రూ.18 వేలు జీతం ఇస్తామని, ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని, ఇపిఎఫ్, ఇఎస్ఐ కటింగ్ పోనూ రూ. 9200 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. అరకొర సౌకర్యాలు కల్పిస్తున్నారని, కొంతమంది కార్మికులకు 4 నెలలుగా జీతాలు లేక పోవడం వలన కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థంకాక అయోమయంలో ఉన్నారన్నారు. మునిసిపల్ కమిషనర్ , అధికారులు క్యాబ్ కార్మికులు పని చేయకపోతే చర్యలు తీసుకుంటారని జీతాలు ఇవ్వడంలో మాత్రం సంబంధం లేనట్లుగా వ్యహరిస్తున్నారని విమర్శించారు.

పత్తికొండ, తుగ్గలి, కోడుమూరు తదితర సెంటర్లలో సిఐటియు ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్స్ కార్మికులు నిసన తెలిపారు.



క్లాప్ ఆటో వర్కర్ల నిరసననుద్దేశించి మాట్లాడుతున్న విజయ్

అవయవాలు దానం చేసి ఆయువును నిలపండి

ప్రజల్లో మరింత అవగాహన పెరగాలి
ఎపి జీవన్ దాన్ సమన్వయకర్త డాక్టర్ రాంబాబు

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

అవయవదానంపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన రావాలని అవయవాలు దానం చేసి ఆయువు నిలపాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవన్ దాన్ సమన్వయకర్త, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు సూచించారు. జాతీయ అవయవదానం దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కర్నూలు కిమ్స్ హాస్పిటల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లక్షల మంది అవయవాలు అందుబాటులో లేక మరణిస్తున్నారని అన్నారు. రోడ్డు ప్రమదాలు జరిగినప్పుడు వారిని స్థానికి ఆస్పత్రులకు తరలిస్తున్నారని, ఆపై మెరుగైన వైద్యం కోసం దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తీసుకు వెళ్తున్నారని అన్నారు. ఆ ప్రయాణ సమయంలో బ్రెయిన్ డెత్‌గా మారి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ సమయంలో వారి కుటుంబాలకు, బంధవులకు అవయవదానంపై అవగాహన కల్పించి అవయవాలు దానం చేసేలేలా కృషి చేయాలన్నారు. ఒక మనిషి మరణించినప్పుడు అతడు అవయవాలు దానం చేస్తే... మరో ఎనిమిది మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కోవిడ్19 మహమ్మారి కాలంలో అనేక మంది ఊపిరితిత్తులు పాడై మరణించారని తెలిపారు. అవయవదానం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జీవన్ దాన్ అనే సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో రోగులు అవయవాల కోసం ధరఖాస్తూ చేసుకోవచ్చన్నారు. అవయవాల దానం కోసం కూడా స్వచ్ఛధంగా తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇటీవలకాలంలో మూత్రపిండాలు, కాలేయం వంటి అవయవాలను ఇవ్వడానికి దాతలు చక్కటి అవగాహనతో ముందుకు వస్తున్నారని, అయితే గుండె, ఊపిరితిత్తుల వంటి కీలక అవయవాలను మాత్రం బ్రెయిన్ డెడ్ తరువాత మాత్రమే సేకరించే వీలుందన్నారు. శనివారం అవయవాల దానం పై శిక్షణ కార్యక్రమం కర్నూలు కిమ్స్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ, ఎపి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వైద్యులు అవయవదానంపై, అపోహలు, వాస్తవాలు, అవయవాలదానంపై పేర్లు ఎలా నమోదు చేసుకోవాలి, ఎలాంటి సందర్భాల్లో అవయవాలు స్వీకరిస్తారు, అవయవాల మార్పిడి ఎప్పుడు చేస్తారు అనే అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి ఆర్గాన్ డొనేషన్ సమితి వైస్ ప్రెసిడెంట్ మంగాదేవి, యూరాలజిస్ట్ యు ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ డాక్టర్ మనోజ్ కుమార్, నెఫ్రాలజిస్ట్ ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ అనంతరావు, కిమ్స్ ఆస్పత్రి ఎండి సిఇఒ రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు




బసవాపురంలో సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సమస్యలు తెలుసుకునేందుకే వచ్చా: ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజల వద్దకు వచ్చానని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. శుక్రవారం ఆయన కర్నూలు మండలం బసవాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ప్రజలను ఇంటింటికి వెళ్లి కలిసి ప్రభుత్వ అందించిన పథకాల లబ్ధిని గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మూడేళ్ల వైసిపి పాలనలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేసిందన్నారు. నిండు మనసుతో జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనుక్షణం పరితపిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలను పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రికి తోడుగా నిలబడే సమయం ఆసన్నమైందని అన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపిపి డి.వాసు వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపి నేహమియా, మాజీ ఉప సర్పంచ్ డి వాసు, సర్పంచి విద్యాసాగర్ వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగ వివక్ష, అసమానతలపై అవగాహన

ప్రజాశక్తి- సి బెళగల్

సిబెళగల్ మం డలంలో లింగ వివక్షత, అసమానతలపై వెలుగు ఎపిఎం వెంకట స్వామి, సి బెళగల్ సర్పంచి పాండు రంగన్న సమక్షంలో ఎంపిడిఒ రాముడు సారథ్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టి బాలికలపైన, మహిళలపైనా లైంగిక దాడులు, అత్యాచారాలు వంటివి రూపుమాపాలని అన్నారు. బ్యాడ్ టచ్,గుడ్ టచ్ వంటి వాటిపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఆధునిక యుగంలో పురుషులతో సమానంగా చూడాలని అందుకు మనందరి బాధ్యత అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సందీప్, ఎంపిపి మునెప్ప, కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చండయ్యా

- మంత్రి జయరామ్‌కు ప్రజల వినతి

ప్రజాశక్తి - ఆస్పరి


మంత్రికి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్‌ను డి.కోటకొండ గ్రామస్తులు కోరారు. శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' లో భాగంగా డి.కోటకొండ గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఫ్లోరైడ్ నీరు సరఫరా అవుతుండడం వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోయారు. కారుమంచి నుంచి డి.కోటకొండ, ఆదోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం మంత్రి జయరామ్ మాట్లాడారు. సచివాలయానికి మంజూరైన రూ.20 లక్షలతో గ్రామంలో డ్రెయినేజీ, సిసి రోడ్డుకు రూ.10 లక్షలు, బైలు పత్తికొండ గ్రామానికి రూ.5 లక్షలు, గార్లపెంట గ్రామానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చిన్నపెండేకల్ నుంచి డి.కోటకొండ గ్రామానికి తారు రోడ్డు వేసేందుకు రూ.42.51 లక్షలు టెండర్ కూడా అయిపోయిందని చెప్పారు. వైసిపి ఆలూరు తాలూకా ఇన్‌ఛార్జీ గుమ్మనూరు నారాయణ స్వామి, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, కెడిసిసి జిల్లా డైరెక్టర్ రాఘవేంద్ర, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన, సర్పంచి జయలక్ష్మి, ఎంపిడిఒ మల్లీశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనమందించాలి

- డిప్యూటీ డిఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వీవర్స్ కాలనీ హైస్కూల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, జిల్లా కమిటీ సభ్యులు అజిత్, పట్టణ కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరుకు వచ్చిన డిప్యూటీ డిఇఒ సుకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణంలో ఉన్న వీవర్స్ కాలనీ జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, ఉడికీ ఉడకని అన్నం, సాంబారు వడ్డిస్తున్నారని తెలిపారు. ఎన్నిసార్లు చెప్పినా ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకన్న పాల్గొన్నారు.

వైసిపితోనే పట్టణాభివృద్ధి : ఎర్రకోట

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


సిసి రోడ్డుకు భూమి పూజ చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి

పట్టణాభివద్ధి అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని వైసిపి సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 21వ వార్డు హెచ్‌బిఎస్ కాలనీ (టేకు చెట్ల) దగ్గర రూ.15 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. కె.శివన్న, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కెఎస్.రఘు, వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డిఇఇ మనోహర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, ప్రధాన కార్యదర్శి యుకె.వీరేంద్ర, కోశాధికారి, 21వ వార్డు ఇన్‌ఛార్జీ తారా రాజశేఖర్, కో ఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్ పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

- ఎడి కార్యాలయం ముందు రైతుసంఘం ధర్నా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

అకాల వర్షాలు, నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎడి కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నకిలీ విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడి పెట్టి రైతులు నష్టపోయారని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో నకిలీ విత్తనాల వల్ల మండలంలో వేలాది ఎకరాల్లో పత్తి పంట నాశనమైందని చెప్పారు. రైతులు అప్పులపాలై వలస బాట పట్టారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎడి గిరీష్‌కు, ఎఒ పాపిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, మండల అధ్యక్షులు శేఖర్, కార్యదర్శి వీరారెడ్డి, కెవిపిఎస్ కార్యదర్శి తిక్కప్ప, రైతు సంఘం నాయకులు తిక్కన్న, మునిస్వామి, హనుమంతు రెడ్డి, చంద్రయ్య, బాష, కౌలు రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, కెవిపిఎస్ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధన చేపట్టాలి - డిఇఒ రంగారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని డిఇఒ రంగారెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. మంత్రాలయం, మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యానగర్ ఎయిడెడ్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఆదేశించారు. గ్రేడ్‌ల వారీగా సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు కూడా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని ఇళ్ల దగ్గర చదవడం వల్ల బాగా నేర్చుకోగలరని తెలిపారు. ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరు కావాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పాఠశాలలో సుమారు 800 మంది విద్యార్థులు ఉన్నారని, 235 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారని తెలిపారు. జగనన్న గోరుముద్ద ద్వారా అందించే మధ్యాహ్న భోజనం రుచిగా ఉంటుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను పాఠ్య పుస్తకంలో ఉన్న కొన్ని ప్రశ్నలు అడగగా విద్యార్థులు ఏమీ చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మేల్కొని విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఎంఇఒ మోహీనుద్దీన్ పాల్గొన్నారు. **గోనెగండ్ల** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ రంగారెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణంపాల్గొన్నారు.


మంత్రాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ రంగారెడ్డి


గోనెగండ్లలో...


సబ్ కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే

సిఎం హామీల అమలుపై సబ్ కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చలు

ప్రజాశక్తి - ఆదోని

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జులై 5న ఆదోని పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీల అమలుపై ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి చర్చించారు. ముఖ్యమంత్రి ఆదోని అభివృద్ధికి ఇచ్చిన హామీల అమలు కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి గెజిట్ కూడా మంజూరయిందని, త్వరలోనే భూసేకరణ చేసి రైతులకు పరిహారం ఇచ్చి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే ఎన్నో ఏళ్లుగా ఆటోనగర్ కోసం ఎదురుచూస్తున్న కార్మికుల కోసం 100 ఎకరాల్లో భూసేకరణ చేసి త్వరలోనే ఆటోనగర్ ఏర్పాటు చేస్తామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రూ.80 కోట్లు ప్రత్యేకంగా జల జీవన మిషన్ కింద నిధులు మంజూరు చేశారని తెలిపారు. పట్టణంలో రోడ్ల విస్తరణకు రూ.50 కోట్లు మంజూరు చేశారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని, అధికారులతో పనులు చేయిస్తామని సబ్ కలెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఆర్ఐ జయరామిరెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఎమ్మెల్యే సలహాదారులు నరసింహమూర్తి పాల్గొన్నారు.


రియాజ్ అహ్మద్‌ను సన్మానిస్తున్న నాయకులు

రియాజ్ అహ్మద్ ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కర్నూలు జిల్లా వక్ఫ్ బోర్డ్ ఉపాధ్యక్షులుగా కె.రియాజ్ అహ్మద్ ఎన్నిక పట్ల జామియా మజీద్ అధ్యక్షులు ఖాసీం బేగ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని జామియా మజీద్‌లో కమిటీ సభ్యులు రియాజ్ అహ్మద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఖాసీం బేగ్ మాట్లాడారు. రియాజ్ అహ్మద్‌కు ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జమాత్, మైనారిటీ నాయకులు, హజ్ కమిటీ డైరెక్టర్ అతావుల్లా, కోపరేటివ్ స్టోర్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, కౌన్సిలర్లు వహీద్, ఇస్సాక్, ఇన్‌ఛార్జీ షాబుద్దీన్, కో ఆప్షన్ సభ్యులు గట్టు ఖాజా, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సయీద్ చాంద్, జామియా మజీద్ కమిటీ సభ్యులు వహీద్ హయా అలీ, మహబూబ్ బాషా, అల్లావుద్దీన్ దౌలా, మజీద్ గురువులు మౌలానా పాల్గొన్నారు.

పంచాయతీలకు ఫాగింగ్ మిషన్లు

- ఇఒఆర్‌డి సంజన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని 13 పంచాయతీలకు దోమలను అరికట్టే ఫాగింగ్ మిషన్లు అందజేస్తామని ఇఒఆర్‌డి సంజన్న తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో మిషన్లు ఎలా వాడాలో వివరించేందుకు కర్నూలు నుంచి మహేష్ అనే టెక్నీషియన్ వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు బాలన్న, జయరాం నాయక్, సుధీర్, రామాంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి మాట్లాడారు. దోమలను నివారించడానికి ఈ పరికరాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. పంచాయతీ కార్యదర్శులందరూ ఆయా గ్రామాలకు పరికరాలు తీసుకెళ్లి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట నమోదు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - హొలహర్వి

పంట నమోదు ధ్రువీకరణ ప్రతాలను రైతులు తప్పకుండా తీసుకోవాలని ఎఒ శివశంకర్ తెలిపారు. శుక్రవారం హొలహర్విలో సర్పంచి మల్లికార్జున ఆధ్వర్యంలో రైతులకు 2022 ఖరీఫ్ సంబంధించిన ఈ-క్రాప్ ధ్రువీకరణ పత్రాలను రైతులకు ఎఒ శివశంకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆర్‌బికెలో విఎఎ కానీ, ఎంపిఇఒను కానీ సంప్రదిస్తే ధ్రువీకరణ పత్రం ఇస్తారని తెలిపారు. ఆర్‌బికెకు వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేసి ఒక రసీదు రైతు దగ్గర ఉంచుకొని, ఇంకో రసీదు ఆర్‌బికెలో ఇవ్వాలని చెప్పారు. మండలంలోని సున్నా వడ్డీ మొత్తం 840 మందికి రైతులకు రూ.22.82 లక్షలు రైతు అకౌంట్‌లో 29న జమ అవుతుందన్నారు. ఎంపిఇఒ హనుమప్ప, రాజశేఖర్ స్వామి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనమందించాలి

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం, నాణ్యమైన భోజనం అందించాలని ఎంపిడిఒ గౌరీదేవి వంట నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కప్పట్రాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే కరివేముల పంచాయతీలో హార్టికల్చర్ చీని మొక్కల తోటను, నాడు-నేడు పనులను పరిశీలించారు. ఎపిఒ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ

ప్రజాశక్తి-ఆలూరు

మహిళలపై దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ విమర్శించారు. శుక్రవారం ప్రయివేట్ జూనియర్ కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో 'మద్యం, మత్తు పదార్థాలను నివారించాలి-మహిళలపై, బాలికలపై అత్యాచారాలు, దాడులు అరికట్టాలి' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఐద్వా జిల్లా నాయకులు షేకున్‌బీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు ఎంఇఒ కోమలదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, జిల్లా కోశాధికారి పిఎస్.సుజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా అలివేలమ్మ మాట్లాడారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 మానవ హక్కుల దినోత్సవం వరకు 16 రోజుల పాటు ఐద్వా ఆధ్వర్యంలో సభలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలపై హింస పెరిగిపోతోందని, మద్యం, మత్తు పదార్థాలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతోనే హింసాత్మక సంఘటనలు పెరిగిపోతున్నాయని చెప్పారు. రోజుకూ 26 అత్యాచారాలు, సగటున గంటకు 49 నేరాలు మహిళలపై జరుగుతున్నాయని తెలిపారు. మహిళలను రక్షించాల్సిన చట్టాలు ధనవంతులకు, అధికారపక్ష నాయకులకు చుట్టాలుగా మారాయని చెప్పారు. హింస పెరగడానికి కారణమైన మద్యం, మత్తు మందులను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గురునాథ్, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ మండల ఉపాధ్యక్షులు మహాలక్ష్మి, సుమలత, ఉమా మహేశ్వరి, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా, ఉపాధ్యక్షులు గోవర్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ



భళా భళా.. వృషభరాజమా..!

- 5 గంటల్లో పదెకరాల్లో వేరుశనగ విత్తనం

ప్రజాశక్తి- దేవనకొండ

ఒక జత ఎద్దులు సాధారణంగా రెండెకరాలు లేక మూడెకరాల్లో వేరుశనగ విత్తనం వేయడం సహజం. మండలంలోని కప్పట్రాళ్లకు చెందిన ఒక జత ఎద్దులు గ్రామ సమీపంలో 5 గంటల్లో పదెకరాల్లో వేరుశనగ విత్తనం వేసి భళా అనిపించుకున్నాయి. కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన రైతు బోయ ముని రంగయ్య ఎద్దులు శుక్రవారం ఉదయం 5.30 నుంచి 10.30 గంటల వరకు పదెకరాల్లో వేరుశనగ విత్తనం వేశాయి. బోయ ముని రంగయ్య చిన్నప్పటి నుంచి మేలైన వృషభాలను పెంచుతూ వ్యవసాయంలో దూసుకుపోతున్నారు. ఈ దృశ్యాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల రైతులు తండోప తండాలుగా తరలివచ్చారు. సాయంత్రం వృషభాలను ఊరేగించారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

- వ్యవసాయ జిల్లా అధికారి వరలక్ష్మి

ప్రజాశక్తి - నందవరం

ఆధునిక పద్ధతులను అనుసరించి పంటల్లో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పిఎల్.వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని నది కైరవాడి గ్రామంలో 2వ రోజు రైతులకు క్లస్టర్ స్థాయి పొలం బడి శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు అశ్వగంధ, ఎర్రచందనం పంటలను వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేసి పండించుకోవాలన్నారు. ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, వ్యవసాయ శాఖ అధికారులు నాగలక్ష్మి, లక్ష్మణ్, శ్రీవాణి, శశిధర్, ఎఒ స్రవంతి, ఎఇఒ సురేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

'అద్దె బస్సులు వద్దు... కొనుగోలు ముద్దు'

ప్రజాశక్తి - ఆదోని

ఎపిఎస్ఆర్‌టిసిలో అద్దె బస్సులు వద్దని, కొనుగోలు చేయడమే ఉత్తమమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అజీంఖాన్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదోని ఆర్‌టిసి డిపో ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2017 పే స్కేల్ ప్రకారం అరియర్స్ చెల్లించాలని, ఎస్ఆర్‌బిఎస్ పైకం అందరికీ చెల్లించాలని కోరారు. ఓటీ అలవెన్స్ ఏ నెలకు ఆ నెల చెల్లించాలని, నైట్ అలవెన్స్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కింద పని చేస్తున్న వారికి కనీస వేతనాలు అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. నాయకులు పివై.ప్రసాద్, ప్రసాద్, సిఐటియు పట్టణ అధ్యక్షులు తిప్పన్న, మండల కార్యదర్శి వీరారెడ్డి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

విద్యా వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకోవాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి - కౌతాళం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్య వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ డివిజన్ నాయకులు బిటి.రామచంద్ర నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ హాస్టల్‌లో పోరుబాట కార్యక్రమంలో భాగంగా సందర్శించినట్లు తెలిపారు. విద్యార్థులకు కనీసం స్వచ్ఛమైన నీరు కూడా అందడం లేదన్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మండలంలో గతంలో ఉన్న హాస్టళ్లను ఎత్తేసి పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడం తగదన్నారు. వెంటనే హాస్టల్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన సేవలు కల్పించాలని డిమాండ్ చేశారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు శ్రీరామ్, మహబూబ్ పాల్గొన్నారు.

గొర్రెల నుంచి పంటలను కాపాడాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - కౌతాళం

గొర్రెల మంద నుంచి రైతులు పండించిన పంటలను కాపాడాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కౌతాళం సర్పంచి పాల్ దినకరన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక ప్రాంతం నుంచి ఈ ప్రాంతానికి గొర్రెల మందలు ప్రతేడాది వస్తున్నాయని తెలిపారు. కొంతమంది స్వార్థపరులు కమీషన్ కోసం ఈఏడాది ముందుగానే గొర్రెల మందలు వచ్చాయని చెప్పారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొర్రెలు మేపిన వారికి జరిమానా విధించేలా చర్యలు తీసుకుంటామని దండోరా వేయాలని కోరారు. రైతు సంఘం మండల కన్వీనర్ వెంకటేష్, పామన్న, బుడదొడ్డి వలీ, హనుమేష్ పాల్గొన్నారు.

వైద్య దంపతుల సేవలు ప్రశంసనీయం

- అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుధాకర్ బాబు

ప్రజాశక్తి - ఆదోని

వైద్య వృత్తి లో స్థిరపడిన వైద్య దంపతులు కిరణ్ కుమార్, రేష్మ ఇతరులకు సహాయ, సహకారాలు అందించాలన్న సేవాగుణం కలిగి ఉండడం ప్రశంసనీయమని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుధాకర్ బాబు, మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున కొనియాడారు. షాష నర్సింగ్ హోమ్ నిర్వాహకులు డాక్టర్ కిరణ్ కుమార్ కుమార్తె షాష షనయ పుట్టినరోజు సందర్భంగా ఆదోనిలో ఎస్సీ హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్టల్ విద్యార్థుల సమక్షంలోనే చిన్నారితో కేక్ కట్ చేయించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డాక్టర్ కిరణ్ కుమార్ విద్యాభ్యాసమంతా సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లోనే కొనసాగిందని, ఆయన డాక్టర్‌గా స్థిరపడి ఉన్నత స్థితిలో ఉన్నప్పటికీ అదే హాస్టల్‌లోని పిల్లల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ... తమ కుమార్తె షాష షనయ పుట్టినరోజు సందర్భంగా ప్రతేడాది సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అప్పట్లో సరైన సౌకర్యాలు లేకపోయినా హాస్టల్‌లో ఉంటూ కష్టపడి చదువుకున్నామని గుర్తు చేశారు. తాను చిన్నపిల్లల వైద్యులుగా, తన భార్య రేష్మ గైనకాలజిస్ట్‌గా సేవలు అందిస్తూ ఆదోనిలో నర్సింగ్ హోం కొనసాగిస్తున్నామని తెలిపారు. హాస్టల్‌లో ఉంటూ పదో తరగతిలో ప్రతిభ కనబరిస్తే ప్రథమ రూ.10 వేలు, ద్వితీయ రూ.5 వేలు, తృతీయ రూ.2500 చొప్పున నగదు ప్రోత్సాహం ఇస్తామని ప్రకటించారు. హాస్టల్ భవనంలో కనీస సౌకర్యాల కల్పనకు కూడా సహకరిస్తానన్నారు. అనంతరం గైనకాలజిస్ట్ డాక్టర్ రేష్మ, చిత్తూరు ఆపోలో మెడికల్ కళాశాల డాక్టర్ సిరాజ్ బేగంతో కలిసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతి ప్రకటించడం పట్ల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు సిద్ధప్ప, భారతి, విశ్వనాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, వైద్య దంపతులకు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. మున్సిపల్ హైస్కూల్ అసిస్టెంట్ నాగరాజ్, నర్సింగ్ హోం సిబ్బంది అనిల్, రాజారత్నం ఉన్నారు.


వైద్య దంపతులను సన్మానిస్తున్న వార్డెన్లు


భూమి పూజ చేస్తున్న వైసిపి నాయకులు మేల గిరి

విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- వైసిపి నాయకులు గిరి

ప్రజాశక్తి - హోళగుంద

విద్యాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వైసిపి నాయకులు మేల గిరి తెలిపారు. శుక్రవారం మండలంలోని వందవాగిలి గ్రామంలో ప్రధానోపాధ్యాయులు హుస్సేన్‌బీ, సర్పంచి భర్త శేషప్పతో కలిసి నాడు-నేడు కింద రూ.56 లక్షలతో ముంజూరైన పాఠశాల అదనపు గదులు, ప్రహరీకి భూమి పూజ చేశారు. పాఠశాల ఛైర్మన్ చంద్రశేఖర్, కన్నడ ప్రధానోపాధ్యాయులు ముత్తన్న, ఉపాధ్యాయులు శరణబసప్ప, కర్రిలింగ పాల్గొన్నారు.

ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1.02 కోట్లు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1,02,99,268 వచ్చిందని దేవాలయ సహాయ కమిషనర్ వాణి తెలిపారు. శుక్రవారం ఆదోని దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. స్వామివారికి నగదుతో 15 గ్రాముల బంగారం, 20 కిలోల 500 గ్రాముల వెండిని భక్తులు సమర్పించుకున్నారని ఆమె తెలిపారు. దేవాలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, సీనియర్ అసిస్టెంట్లు రామలింగారెడ్డి, విజయ్, కుమార్ దేవాలయ సిబ్బంది, స్వచ్ఛంద సహాయకులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- నాడు-నేడు పనులను పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని ఎంపిడిఒ గీతావాణి సూచించారు. శుక్రవారం మండిగిరి పంచాయతీ పరిధిలోని తిరుమల నగర్ ఎంపియుపి స్కూల్‌లో రెండో విడత కింద జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాడు-నేడు పథకం పాఠశాల రూపురేఖలు మారతాయని తెలిపారు. విద్యార్థులు చదువుకోడానికి ఎంతో ఆహ్లాదకరంగా ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేశారు. మాజీ సర్పంచి శేషిరెడ్డి, జియాలజిస్ట్ ధనుంజయ రెడ్డి, మండగిరి సెక్రటరీ చంద్రశేఖర్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ గీతావాణి


మాట్లాడుతున్న ఆర్‌సిసి ఎసి శ్రీకాంత్ రెడ్డి

పోరాటాలతోనే విద్యార్థి సమస్యలు పరిష్కారం

- ఆర్‌సిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పోరాటాల ద్వారానే విద్యార్థి సమస్యలు పరిష్కారమవుతాయని రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎసి.శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆడిటోరియంలో సీమ విద్యార్థి ఆధ్వర్యంలో రాయలసీమలోని విద్యా వెనుకబాటుతనం గురించి జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు, చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రాయలసీమ అన్ని రంగాల్లోనూ వెనుకబడిందని చెప్పారు. ఇక్కడ విద్యారంగం కుంటుపడడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. రాయలసీమకు రావాల్సిన హక్కులు, శ్రీబాగ్ ఒప్పందం, నీటి సదుపాయాలు, సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. లేకపోతే సీమ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. విద్యార్థి సంఘం నాయకులు, బల్లేకల్లు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ పాల్గొన్నారు.

మార్చి చివరి దాకా నీరందించాలి

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి - దేవనకొండ


రాస్తారోకోలో మాట్లాడుతున్న వెంకప్ప

హంద్రీనీవా సాగునీటి సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి మార్చి చివరి వరకు సాగునీటిని విడుదల చేయాలని జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ దగ్గర భారీ ఎత్తున జనసేన పార్టీ కార్యకర్తలతో కలిసి రాస్తారోకో, తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మార్చి చివరి వరకు నీరిస్తామని స్థానిక మంత్రి ప్రకటించినా హంద్రీనీవా అధికారులు మాత్రం డిసెంబర్ వరకే నీటి విడుదల అంటూ ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం దేవనకొండలోని పలు కాలనీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన మండల అధ్యక్షులు మగ్బుల్, బడేసాబ్, మహిళ మండలాధ్యక్షులు సరోజ, మండల నాయకులు ఆంథోని, నందు, రామలక్ష్మన్న, నాగరాజు పాల్గొన్నారు.

జొహరాపురం రోడ్డు పనులను చేపట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరి నుంచి జొహరాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో నిలిచిపోయిన రోడ్డు పనులను చేపట్టాలని సిపిఎం మండల కార్యదర్శి హనుమంతు, సీనియర్ నాయకులు మాణిక్యప్ప, సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం నిలిచిపోయిన రోడ్డు పనులను పరిశీలించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ రోడ్డు కొన్నేళ్ల నుంచి గుంతలుగా ఉందన్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టర్లు రోడ్డును జెసిబితో తవ్వి కంకర వేసి ఏడాది కావస్తున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. డివైఎఫ్ఐ నాయకులు మురళీ, ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు తిమ్మప్ప, నాగరాజు, సంజప్ప పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- రామదుర్గం సర్పంచి రోహిణి

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే తమ ధ్యేయమని సర్పంచి రోహిణి తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ, రెవెన్యూ కార్యదర్శి మల్లికార్జునలు సచివాలయ కార్యాలయంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర హౌసింగ్ సర్వే, భూ హక్కు సర్వే ద్వారా ప్రజలకు మేలు జరిగేలా చూస్తోందన్నారు. సర్వేకు వచ్చిన అధికారులతో ప్రజలు సహకరించాలని కోరారు. వైసిపి సీనియర్ నాయకులు వీరప్ప, సర్వేయర్ గోవర్ధన పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రైతు సంఘం అండ

- దీక్షకు మద్దతు తెలిపిన కె ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై ప్రభుత్వం, సిఆర్‌డిఎ తక్షణమే స్పందించాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్ జీతాలు, పని భద్రత, ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలనే అంశాలపై రాజధానిలోని తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన దీక్షలు 7వ రోజుకు చేరాయి. శుక్రవారం దీక్షా శిబిరాన్ని ప్రభాకర్‌రెడ్డి సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం దాన్ని విస్మరించడమే కాకుండా జనవరి నుంచి 'మీకు - మాకు సంబంధం లేద'న్నట్లు సంకేతం ఇవ్వడం బాధ్యతా రాహిత్యమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు లేకుండా సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ పనీ జరగదని తెలిపారు. కార్మికులకు రైతు సంఘం పూర్తి అండగా ఉంటుందని ప్రకటించారు. సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు ఉండే ప్రాంతంలో కార్మికుల కడుపు మాడుతుంటే పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ఇదే తీరు కొనసాగితే గ్రామాల్లో తిరిగి ప్రజల మద్దతు కూడగట్టి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయం ముట్టడి, మంత్రుల వద్ద భిక్షాటన చేస్తామన్నారు. అన్ని మున్సిపాల్టీల్లో కార్మికులకు జీతం రూ.21 వేలు ఇస్తుంటే రాజధానిలో మాత్రం రూ.12 వేలే ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ముందుగా కార్మికుల దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి వేముల దుర్గారావు ప్రారంభించి, మద్దతు తెలిపి ప్రసంగించారు. అమరావతి రైతు జెఎసి నాయకులు లంకా సుధాకరరావు కార్మికులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. దీక్షల్లో రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి, రైతు నాయకులు లంకా సుధాకరరావు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకరరావు

తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్న సిఎస్

ప్రజాశక్తి - తిరుచానూరు (తిరుపతి జిల్లా)

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న సమీర్‌శర్మకు టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎంఎల్‌ఎ, టిటిడి బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్‌డిఒ కనక నరసారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఎఇఒ ప్రభాకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దాము పాల్గొన్నారు.

చంద్రబాబు అండతోనే 'మార్గదర్శి'లో అక్రమాలు

- అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు అండతోనే మార్గదర్శిలో అక్రమాలు జరుగుతున్నాయని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మార్గదర్శి అంతా అక్రమాల పుట్ట అని విమర్శించారు. అక్రమంగా డిపాజిట్లను సేకరించి బ్యాంకులో జమచేయకుండా పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. మార్గదర్శి డబ్బును నిబంధనలకు వ్యతిరేకంగా ఇతర సంస్థల్లో పెట్టుబడులు పెడుతున్నారని విమర్శించారు. మీడియా సంస్థలతోపాటు ఫిలింసిటీ, ప్రియాఫుడ్స్, డాల్ఫిన్ హోటల్స్‌కు మళ్లించారని అన్నారు.

నరసమ్మ మృతిపట్ల ఐద్వా సంతాపం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉన్నత విద్యావంతులు, చిన్నతనం నుంచే కమ్యూనిస్టు భావజాలాన్ని అలవర్చుకున్న వాసిరెడ్డి వెంకట నరసమ్మ మృతిపట్ల ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేసిన కాలంలోనూ, రిటైర్ అయిన తరువాతా వివిధ ఉద్యమాలకు మద్దతుగా నిలబడ్డారని పేర్కొన్నారు. ఆమె భర్త సత్యనారాయణ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, సిపిఎం సభ్యులుగా సుదీర్ఘకాలం చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలుపై పరిమితి వద్దు

- ఎపి కౌలు రైతుసంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతుల వద్దనుండి ధాన్యం కొనుగోలుపై వున్న పరిమితిని తొలగించాలని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. రైతులకు అవసరమైనన్ని గన్నీ బ్యాగులు కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలనీ కోరింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ ఎమ్‌డి వీరపాండ్యన్‌ను ఎపి కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, నాయకులు నాగేశ్వరరావు కలసి వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలులో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సాంకేతిక అంశాలను రైతులకు తెలిపేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలతో తేమశాతం ఎక్కువ వుందని అయినా రైతులు నష్టపోకుండా దాన్యం మొత్తం కొనుగోలు చేయాలని కోరారు. తుఫానులు, అధిక వర్షాలు ఉన్నపుడు పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్‌లను ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధన తగదని రైతు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

27న ఇప్పటం రైతులకు ఆర్థిక సాయం : జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రహదారి విస్తరణ పేరుతో ఇప్పటంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఈనెల 27న మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ లక్ష రూపాయల చెక్కులను అందజేయనున్నారు. ఈ మేరకు జనసేన అధ్యక్షుడి రాజకీయ కార్యదర్శి పి. హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటం గ్రామస్తులకు న్యాయం చేస్తామని వివరించారు.

ప్రజాభివృద్ధే వైసిపి లక్ష్యం: ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-తుగ్గలి

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి వైసిపి లక్ష్యమని పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని రామ్‌కొండ గ్రామంలో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,మధు యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాల్లో పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించడం హర్షించదగ్గ విషయం అన్నారు. బడుగు బలహీన వర్గాలకు అన్ని సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సచివాలయాలతో మెరుగైన సేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కిందన్నారు. సర్పంచి పాటిల్ హారిక రెడ్డి, సొసైటీ చైర్మన్ అట్లా గోపాల్ రెడ్డి, జిట్టా నగేష్ యాదవ్, తుగ్గలి మోహన్ రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు,మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కె.శ్రీదేవి

డిఆర్‌డిఎ పిడిగా వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్గా వెంకటసుబ్బయ్య శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. కలెక్టరేట్ లోని డిఆర్డిఎ పీడీ చాంబర్ కార్యాలయంలో ఆయన ఇన్చార్జి పిడి శ్రీధర్ రావు నుండి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఈ కోటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ అభివద్ధి సంస్థ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను మరింత వేగవంతంగా అమలు చేసేందుకు కషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు డిఆర్డిఎ లోని పలు విభాగాలకు చెందిన అధికారులు కలిసి స్వాగతం పలికారు. జిల్లాలో సుదీర్ఘకాలం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మరియు జిల్లా పరిషత్ ముఖ్య అధికారిగా విధులను నిర్వహించారు.



రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కెవి.నారాయణ, తదితరులు

ప్రజావ్యతిరేక సర్కార్ కు బుద్ధిచెప్పాలి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-కోడుమూరు

పేదల కడుపు కొట్టి పెద్దలకు దోచిపెడుతున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి నారాయణ అన్నారు. కోడుమూరు పట్టణంలో సుందరయ్య భవనంలో జరిగిన సంఘం జిల్లాకమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు పేదల కడుపు కొట్టి కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని అన్నారు. దేశంలో ఉన్న ఉపాధిహామీ చట్టంలో అనేక మార్పులు తెచ్చారని, దాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని అన్నారు. నగదు బదిలీ పెట్టి ప్రజా పంపిణీ వ్యవస్థకు మంగళం పలుకుతున్నారన్నారు. పేదల నోటికాడి తిండి లాగేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి నవరత్నాల పేరుతో భిక్ష వేస్తున్నానని, అనుకుంటున్నాడన్నారు. కానీ పేదల పట్ల విశ్వాసం ఉంటే అసైన్డ్ మెంట్ కమిటీ వేసి ఎందుకు భూములు పంచకూడదని అన్నారు. జగనన్న కాలనీలు మొండి గోడలతో దర్శనం ఇస్తున్నాయని, ఇంకెన్నాళ్లు కావాలని అన్నారు.జిల్లాలో వలసలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టి ఉపాధిహామీ పనులు కల్పిస్తామని చెప్పే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వం చెప్పలేదన్నారు. ఎందుకంటే మోడీ కి వ్యతిరేఖంగా మాట్లాడలేరని అన్నారు. అందుకే డిశంబర్ 8,9,10.తేదీలలో ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో జరుగు రాష్ట్ర మహాసభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పేదల వ్యతిరేక విధానాలపైన చర్చించి ఆందోళనలకు పిలుపు నిస్తామని అన్నారు. అనంతరం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె లింగన్న, ఉపాధ్యక్షులు బి విరాశేఖర్, కె వెంకట రాముడు, తిక్కన్న, రామాంజనేయులు,గపూర్‌మియా, మోహన్, తిమ్మన్న,రంగరాజు, నాగన్న, ఆజాద్, హుసేనయ్య, తదితరులు పాల్గొన్నారు.

తక్కు పెట్టుబడితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-పత్తికొండ : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చని పత్తికొండ సహాయ వ్యవసాయ సంచాలకులు మోహన్ విజయ్ కుమార్ అన్నారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో పొలంబడి , తోటబడి కార్యక్రమం నిర్వహించారు. పత్తికొండ రైతు భరోసా కేంద్రంలో మేలైన యాజమాన్య పద్ధతులపై పత్తికొండ , దేవనకొండ ,మద్దికేర, తుగ్గలి మండలాలకు సంబం ధించిన రైతు భరోసా సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. నాలుగు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, జిల్లా వనరుల కార్యాలయం టెక్నికల్ ఏవో మాధురి, బి. హేమలత జిల్లా ఆర్టికల్చర్ ఆఫీసర్ పి.రామాంజనేయులు ఎపిడి రాజ్య కృష్ణారెడ్డి ఆర్టికల్చర్ ఆఫీసర్ అనూష ఆర్గానిక్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి పత్తికొండ హబ్ ఏవో అనురాధ రెడ్డి రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సున్నా వడ్డీ విడుదల

ప్రజాశక్తి -తుగ్గలి : రైతులు తీసుకున్న రుణాలకు సున్నా వడ్డీ కింద నిధులు విడుదలైనట్లు మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలం పరిధిలోని రాతన గ్రామ సచివాలయంలో దానికి సంబంధించిన బ్రోచరును వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టికల్చర్ జిల్లా అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ 20 -21 రబీకి సంబంధించి 134 మంది రైతులకు రూ.కోటి.99 లక్షలు, ఖరీఫ్‌కు సంబంధించి 5828 మంది రైతులకు రూ.కోటి43 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులను ఈ నెల 29న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతుల ఖాతాలలోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని అన్ని ఆర్‌బికెలలో రైతుల జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. సర్పంచి రాచప్ప, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజా కృష్ణారెడ్డి, నియోజకవర్గ ఆర్టికల్చర్ అధికారి అనూష, మైక్రో ఇరిగేషన్ అధికారి ఎజె కెల్, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న స్థానికులు

సంక్షేమ పథకాలుతోనే పేదల అభ్యున్నతి : హాఫిజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి సాధ్యమని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఏ.హఫీస్ ఖాన్ అన్నారు. కర్నూలు 18వ వార్డ్ 44వ సచివాలయాల జోహరాపురం విజయ టాకీస్ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా, ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని పేర్కొన్నారు. 18వ వార్డ్ పరిధిలోని ప్రతి ఇంటి గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను ఆరా తీశారు. సంక్షేమ పథకాలు అందడంలేదని దృష్టికి తీసుకొచ్చినవారి ఎదుటే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు 18వ వార్డ్ కార్పొరేటర్ పల్లవి, కార్పొరేటర్ కైపా పద్మలత, నాయకులు విజయలక్ష్మి, లేపాక్షి, చెన్నమ్మ, సంధెపోగు చిన్నబాబు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం

- ఆర్‌యు వి సి ఆనందరావు

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్


ప్రతిభగల యువ క్రీడాకారులను ప్రోత్సహించడమే మన ముందరున్న లక్ష్యమని రాయలసీమ యూనివర్సిటీ ఆచార్య ఆనందరావు అన్నారు. శుక్రవారం యూనివర్సిటీ క్రీడ మైదానంలో ఆర్‌యు అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ బల్, ఫుట్ బాల్, సెపక్తక్రా క్రీడా పోటీలను ఉపకులపతి,రెక్టార్ సంజీవరావు, రిజిస్ట్రార్ మధుసూధన్ వర్మ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌టికె నాయక్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ హరి ప్రసాద్ రెడ్డి, డిగ్రీ కళాశాలల వ్యాయామ అధ్యాపకుల సంఘం కార్యదర్శి డాక్టర్ వై కళ్యాణ్ కుమార్, రాయలసీమ యూనివర్సిటీ స్పోర్ట్స్ కోఆర్డినేటర్, పోటీల నిర్వాహక కార్యదర్శి డాక్టర్ శివకుషోర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆనందరావు మాట్లాడుతూ క్రీడాకాలను ప్రోత్సహించేందుకు తాము అన్ని విధాలుగా కృషి చేస్తామని, క్రీడాకారులు కూడా యూనివర్సిటీ పరిధిలోని వనరులను ఉపయోగించుకొని క్రీడారంగంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం రిజిస్టర్ మధుసూదన్ వర్మ మాట్లాడుతూ క్రమశిక్షణతో క్రీడ పోటీల్లో పాల్గొని గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. అంతకుముందు వివిధ కళాశాల కు చెందిన క్రీడాకారులు అతిథులకు గౌరవ వందనాన్ని సమర్పించారు.



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఆర్‌యు విసి ఆనందరావు

పాలిమర్ సైన్స్ కు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాబోయే రోజుల్లో పాలిమర్ సైన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని విద్యార్థులు ఈ రంగంలో పరిశోధన చేసేందుకు దృష్టి సారించాలని సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ నారాయణశాస్త్రి సోమనాథన్ అన్నారు. శుక్రవారం నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఆప్టోఎలక్ట్రానిక్ పదార్థాల కోసం పాలిమర్ల నిర్వహణ అనే సదస్సు నిర్వహించారు. సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ నారాయణశాస్త్రి సోమనాథన్ మాట్లాడారు. మన దైనందిన జీవితంలో పాలిమర్‌తో తయారు చేసిన పదార్థాలు ప్రాముఖ్యత కారణంగా పాలిమర్ సైన్స్ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఇంజనీర్ల అవసరం చాలా వేగంగా పెరిగిందన్నారు. పాలిమర్ సైన్స్ రంగంలో మెరుగైన పరిజ్ఞానం ఉన్న వారు పాలిమర్ పరిశ్రమలలో మంచి స్థానాలను పొందుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పెట్రోలియం పరిశ్రమ, చమురు పరిశ్రమ, పాలిమర్ పరిశ్రమ, రబ్బరు పరిశ్రమ మొదలైన వాటిలో ఉద్యోగ , ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నారాయణశాస్త్రి సోమనాథన్‌ను శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ జెఎండి.షఫీ, సైన్స్ విభాగము సిబ్బంది డాక్టర్ ఎన్‌ఎండి.అక్రమ్, డాక్టర్ నాబియా సుల్తానా, డాక్టర్ నిర్మల, డాక్టర్ జహనారా, విద్యాగోదావరి, విద్యార్థులు పాల్గొన్నారు.





సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

జగన్ పాలన జన రంజకం : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా రంజకంగా పాలన చేస్తున్నారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 37వ వార్డు 97 వ సచివాలయం వీకర్ సెక్షన్ కాలనీలో గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్యెల్యే కాలనీలలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, స్థానిక వార్డ్ కార్పొరేటర్ అయేషా సిద్ధిఖా, కార్పొరేటర్ సాపురు మాధురి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంత రెడ్డి, నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి సెల్ శివ సందేపోగు, నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బంది వినతులు స్వీకిరిస్తున్న ఎస్‌పి సిద్దార్ధకౌశల్

సమస్యల పరిష్కారమే గ్రీవెన్స్‌డే లక్ష్యం : ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని కర్నూలు ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ అన్నారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు , ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది మొత్తం 28 మంది మెడికల్ సమస్యలు , అనారోగ్య సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్‌పి సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ ఎఒ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సిఐ లక్ష్మయ్య పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికేట్ సర్క్యులర్ ఉపసంహరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికేట్ ఇస్తేనే జీతాలు వేస్తామని చెబుతూ జారీ చేసిన సర్కులర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, జిల్లా అధ్యక్షుడు పిఎస్. రాధాకృష్ణ, జిల్లా నాయకులు నాగేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రంలోనే కర్నూల్ నగర పాలక సంస్థ వింత చేష్టలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని పద్ధతుల్లో సచివాలయ ఉద్యోగులు డ్యూటీ సర్టిఫికెట్ ఇస్తేనే జీతాలు క్లియరెన్స్ అవుతాయని సర్కులర్ ఇవ్వడం దుర్మార్గమన్నారు. ఇది కేవలం సచివాలయ ఉద్యోగులను తమ కను సన్నల్లో పెట్టుకోవడం కోసం మున్సిపల్ అధికారులు తీసుకున్న చర్యలని వారు విమర్శించారు. వాళ్ళు ఇచ్చిన సర్క్యులర్‌లో సచివాలయాల్లో పనిచేసే సందర్భంగా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్ , జాయింట్ కలెక్టర్, కమిషనర్ తనిఖీ చేసే సందర్భంగా చాలామంది సచివాలల్లో ఉండడం లేదని, అందుకోసమే ఇలాంటి సర్క్యులర్ ఇవ్వాల్సి వచ్చిందని దాంట్లో పేర్కొనడం తెలివితక్కువ పని అని విమర్శించారు. ఏ ఉద్యోగి అయినా ఆన్ డ్యూటీలో డ్యూటీ ప్లేస్‌లో లేకపోతే అలాంటి వారిపై మెమోలు జారీ చేయవచ్చు, లేదంటే సస్పెండ్ చేయవచ్చు అలాకాకుండా అందరిని కలిపి ఒకే ఘాటన కట్టేసి ఈ రకంగా సర్కులర్ ఇవ్వడం తగదన్నారు. డ్యూటీ సర్టిఫికెట్ ఎప్పుడు ఇస్తారని, ఒక ఉద్యోగి తాను పనిచేసే ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాలకు కేటాయించినప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న పై అధికారి తన దగ్గర పనికి కేటాయించిన ఉద్యోగి పని చేశాడా లేదా అని తెలుసుకొనడానికి ఆ ప్రాంతంలో ఉన్న అధికారి నుండి డ్యూటీ సర్టిఫికెట్ తీసుకుని రావాల్సి ఉంటుందన్నారు. ఎందుకంటే డ్యూటీ చేసేది ఒక ప్రాంతంలో జీతం తీసుకునేది మరొక ప్రాంతంలో కాబట్టి అప్పుడు డ్యూటీ సర్టిఫికెట్ అవసరమవుతుందన్నారు. కర్నూల్ నగర కార్పొరేషన్ పరిధిలో తన సచివాలయంలో తాను పనిచేస్తున్న ఉద్యోగి డ్యూటీ సర్టిఫికెట్ ఏ రకంగా తీసుకుని వస్తాడన్నారు. రోజుకు మూడుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన థంబు వేసి ఆన్ డ్యూటీ లో ఉన్నప్పుడు ఇంతకంటే సాక్ష్యం మరొకటి ఏముంటుందని ప్రశ్నించారు. ఇది కేవలం సచివాలయ ఉద్యోగులను వేధించడం తప్ప మరొకటి కాదన్నారు. తక్షణమే నగర పాలక సంస్థ విడుదల చేసిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని, డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వని వాళ్ళ పై వేధింపులు ఆపాలని వారు డిమాండ్ చేశారు.



విలేకరుసమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌస్ దేశాయి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్

శాస్త్రీయ అవగాహనతో ఫార్మసీ విద్యనభ్యసించాలి

మైపర్ ఆకాడమిక్ డైరెక్టర్ స్టెలా సతీష్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శాస్త్రీయ అవగాహనలో ఫార్మసీ రంగంలో వస్తున్న మార్పులను అధ్యయం చేయాలని మదర్ థెరిస్సా ఫార్మసీ కళాశాల అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్ విద్యార్థులకు సూచించారు. కర్నూలు మదర్ థెరిస్సా ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కళాశాలలో సైంటిఫిక్ సెషన్ నిర్వహించారు. అకాడమిక్ డైరెక్టర్ స్టెల్లా సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, , కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. సురేష్, అకాడమిక్ డీన్ ఎం. రాజ్ కుమార్ , అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. స్టెల్లా సతీష్ మాట్లాడుతూ సైంటిఫిక్ సెషన్ ద్వారా ఫార్మసీలో జరుగుతున్న విప్లవాత్మక మార్పుల గరించి విద్యార్థులకు వివరించారు. ఫార్మసీ విద్య అభ్యసించి విద్యార్థులు విద్యార్థి దశలోనే మంచి జ్ఞానం అభివృద్ధి చేసుకోవాలని అన్నారు.





మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్

14 శాతం ఖాళీ

- ఇంజనీరింగ్‌లో మిగిలిపోయిన సీట్లు

- అత్యధికంగా అశోకాలో 99.65 శాతం సీట్లు భర్తీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని ఇంజనీరింగ్ సీట్లలో 14 శాతం సీట్లు భర్తీ కాలేదు. 85.97 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. భర్తీ అయిన వాటిలో అత్యధికంగా కర్నూలులోని అశోకా ఇంజనీరింగ్ కళాశాలలో 99.65 శాతం సీట్లు భర్తీ అయ్యాయి..

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఇటీవల ప్రత్యేక ఫేస్ భర్తీ కార్యక్రమం చేపట్టింది. అది పూర్తయిన తరువాత కూడా సీట్లు భర్తీ కాకుండా ఖాళీగా ఉండిపోయాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 12 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో కన్వీనర్ కోటా కింద మొత్తం 5,064 సీట్లు ఉన్నాయి. ప్రత్యేక ఫేస్ భర్తీ తరువాత 4,354 సీట్లు భర్తీ అయ్యాయి. మిగతా 710 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. అంటే 14.03 శాతం ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయి. అత్యధికంగా కర్నూలులోని అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 99.65 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. తరువాత జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 99.42 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 99.31 సీట్లు, శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలలో 93.45 సీట్లు, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో 89.73 శాతం సీట్లు, నంద్యాల ఆర్‌జిఎం కళాశాలలో 82.57 శాతం సీట్లు, సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 80.65 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఎస్‌విఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 80.21 శాతం సీట్లు, డాక్టర్ కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 73.84 శాతం సీట్లు, రాయలసీమ యూనివర్సిటీ సెల్ఫ్ ఫైనాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో 48.86 శాతం, బృందావన్ ఇంజనీరింగ్ కళాశాలలో 42.71 శాతం సీట్లు, భీమా ఇంజనీరింగ్ కళాశాలలో 42.50 శాతం సీట్లు భర్తీ అయ్యాయి.

కళాశాల వారీగా

కళాశాల	ఖాళీ సీట్లు
అశోకా	01
జి.పుల్లారెడ్డి	05
రవీంద్ర	02
శాంతిరామ్	22
జి.పుల్లయ్య	69
ఆర్‌జిఎం	159
సెయింట్ జాన్స్	65
ఎస్‌విఆర్	76
కెవి సుబ్బారెడ్డి	113
ఆర్‌యు	135
బృందావన్	165
భీమా	138
మొత్తం	710

బిజెపి విధానాలను ఎండగట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపికి 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కొత్త బస్టాండు వైష్ణవి కాలేజీలో సిపిఎం కార్యకర్తల సమావేశం కె భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారతదేశంలో మెజార్టీగా ఉన్న హిందువుల ఓట్ల లబ్ధి కోసం హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల మధ్య మత ఘర్షణలు సృష్టిస్తోందన్నారు. 2002లో బాబ్రీ మసీదును కూల్చి పార్లమెంటులో రెండు సీట్లున్న బిజెపి నేడు రెండోసారి అధికారంలోకి రావడం జరిగిందని వారు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన బిజెపి ఎన్నికల ముందు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, 100 రోజుల్లో ధరల అరికడతామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు అవుతున్న చేసిన వాగ్దానాలు అమలు చేయకపోగా పెట్రోల్ ,డీజిల్ ,వంట గ్యాస్, నిత్యసుల సరుకుల ధరలు విపరీతంగా పెంచడం, ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలన్నీ పక్కదారి పట్టించేందుకు మత రాజకీయాలకు బిజెపి పాల్పడుతోందని వారు అన్నారు. ఐటి, సిబిఐ తదితర సంస్థల ద్వారా ప్రజా స్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంపదను కార్పొరేట్ శక్తులు బిజెపి దోచిపెడుతుందని ఆరోపించారు. పెట్టుబడుదారుల నుండి పోగు చేసుకున్న డబ్బులను ప్రజా ప్రతినిధులకు ఎరవేసి కొనుగోలు చేసి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, గోవా తదిత రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం జరిగిందని వారు ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని కూల్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, అమలు చేయని నరేంద్ర మోడీని రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు స్వాగతం పలకడం విచారకరమన్నారు. కుల, మతాలకతీతంగా మతసామరస్యం కోసం కమ్యూనిస్టులు పనిచేయాలని వారు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర నాయకులు ఆబు బాకర్, సిపిఎం నాయకులు పి ఫకీర్ సాహెబ్, పి వెంకటేశ్వర్లు, టీ ఓబులేసు, సంపంగి వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ, బెస్తరాజు ఆంజనేయులు, ఎం కర్ణ, లింగస్వామి రామకృష్ణ, సోడా బిబి రంగమ్మ, ఉసేన్నమ్మ, వేణుగోపాల్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హత మేరకు గుర్తించిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ తహశీల్దారులు, ఆర్డిఓలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో 90 రోజుల ఇళ్ల పట్టాలు, మ్యూటేషన్ దరఖాస్తులు, చుక్కల భూములు, పిఓఎల్ఆర్ రీసర్వే, జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం, స్పందన అర్జీలు, వ్యతిరేక వార్తల యాక్షన్ టేకెన్ రిపోర్టులు, పౌర సరఫరాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం, భూసేకరణ తదితర రెవిన్యూ అంశాలపై అన్ని మండలాల తాసిల్దారులు, ఆర్డీవోలతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా స్వీకరించిన దరఖాస్తులలో అర్హులుగా గుర్తించిన 92,792 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు చేపట్టాలని తాసిల్దార్లను ఆదేశించారు. జగనన్న భూహక్కు – భూ రక్షా పథకం కింద చేపట్టిన సమగ్ర రీ సర్వే పనులు పూర్తయిన గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీకి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందిగా ఆర్డీవోలను సూచించారు. ఇందుకు సంబంధించి డ్రాఫ్ట్ పబ్లికేషన్‌తో పాటు రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మ్యూటేషన్ కరెక్షన్ కోసం అందిన దరఖాస్తులు, ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ రీసర్వేలో గ్రౌండ్ వ్యాలిడేషన్, గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి విత్ ఇన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలన్నారు. స్పందన సమస్యల పరిష్కారానికి సంబంధించి రీఓపెన్ అయిన 70 సర్వీసులపై పూర్తిస్థాయి దృష్టి సారించి క్లియర్ చేయాలని సంబంధిత మండల తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. అలాగే వితిన్ ఎస్ఎల్ఏలో ఉన్న దరఖాస్తులు, 24 గంటలు, నలభై ఎనిమిది గంటల్లో పరిష్కరించాల్సిన 9 సర్వీసులు, ఏపీ సేవా సర్వీసులో ఉన్న 436 దరఖాస్తులను నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత తహసీల్దారులను ఆదేశించారు. జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ కోర్టులలో ఉన్న పెండింగ్ కేసులు, పత్రికల్లో ప్రచురితమైన వ్యతిరేక వార్తలు తదితర 11 రెవెన్యూ అంశాలపై మండల తాసిల్దార్‌లు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాలపరిమితిలోగా క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, యం.దాసు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నూతన ఆర్‌టిసి బస్సులను ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైయస్సార్ బడుగు వికాసం పథకం కింద ఎస్సీ ,ఎస్టీ వైయస్సార్ ప్రోత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం మంచి నిర్ణయాలలో భాగంగా శుక్రవారం దైవ కుమార సోదరుడు ఏపీఎస్ఆర్టీసీకి బస్సులను ఏర్పాటు చేశారని ఏంటి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిలు అన్నారు. అందులో 40 శాతం రాయితీ కల్పించినట్లు పేర్కొన్నారు. నంద్యాల నుండి రుద్రవరం వరకు రెండు బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా అయిన తర్వాత డిపో నుండి అనేక బస్సులు ఏర్పాటు చేశారని తెలపారు. ఇటువంటి ప్రోత్సాహకులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారి తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



నూతన బస్సులను ప్రారంభించిన.. ఎంపీ పోచ, ఎమ్మెల్యే శిల్పా

ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాటానికి సిద్ధం కండి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని ఆటో వర్కర్స్ యూనియన్ ఆల్ ఇండియా కమిటీ సభ్యులు ప్రభాకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని సిఐటియు కార్యాలయం నందు శుక్రవారం ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నంద్యాల జిల్లా ప్రథమ మహాసభ యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆటో వర్కర్స్ యూనియన్ ఆల్ ఇండియా కమిటీ సభ్యులు ప్రభాకర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నంద్యాల జిల్లాలోని మండలాల యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్ల ముఖ్య నాయకులు 100 మంది పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్, వి.ఏసురత్నంలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రవాణా రంగంపైన కక్షగట్టి పాలన సాగిస్తుందని అన్నారు. ముఖ్యంగా రోడ్డు రవాణా రంగా భద్రతా చట్టం పేరుతో పార్లమెంట్లో బిల్లు చేసి డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడెందుకు సిద్ధమైందని అన్నారు. ఆర్టిఏ, ఆర్టిఓ, పోలీసు అధికారులను డ్రైవర్లపైకి పురమాయించి పెద్ద ఎత్తున చలానాలు జరిమానాల పేరుతో విధించేందుకు పూనుకుందన్నారు. ఈ విధానాలకు వత్తాసుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు పలకడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికే పెట్రోల్ డీజిల్ ధరలు రోజురోజుకు పెంచుతూ ఉండడంతో డ్రైవర్ల జీవితాలు దుర్భర పరిస్థితిలో ఉన్నాయని అన్నారు. డ్రైవర్ల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. యూనియన్ పెట్టుకున్న ప్రతిచోట స్టాండు ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఆటో డ్రైవర్ల అందరూ ఐక్యంగా ఉండి పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. ఈ మహాసభకు వివిధ మండలాలు నాయకులు శ్రీనివాసులు, రమేష్ బాబు ,వెంకట్, సికిందర్ ,రఫీ, రామచంద్రుడు, నాయక్, చంటి, దస్తగిరి, ఖాజా, మధు గోపాల్, సుధాకర్, మద్దిలేటి, నాగరాజులతో పాటు అన్ని మండలాల ఆటో స్టాండ్‌లో ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు ప్రభాకర్

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల

ఇండియన్ తైక్వాండో ఫెడరేషన్‌కు అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో, కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ నిర్వహణలో శుక్రవారం నంద్యాల రామకృష్ణ పీజీ కళాశాల శ్రీ కాశిరెడ్డి నాయన ఇండోర్ స్టేడియంలో రెండవ రాష్ట్ర స్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన, ఆంధ్రప్రదేశ్ తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి,నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు ఇసాక్ బాషా, పురపాలక చైర్పర్సన్ మాబున్నీసా, రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి 2వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల యువతలో ఆత్మస్థైర్యం, శారీరక దారుఢ్యం ఇనుమడిస్తాయని అన్నారు. శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాగా ఏర్పడిన తర్వాత నంద్యాలలో పెద్ద స్థాయిలో రాష్ట్ర తైక్వాండో పోటీలు నిర్వహించడం నంద్యాలకు గర్వకారణమన్నారు. భవిష్యత్తులో కూడా నంద్యాలలో రాష్ట్ర జాతీయ స్థాయి పోటీలు జరగడానికి అవకాశం ఉందన్నారు. క్రీడలను ప్రోత్సహిస్తామని,క్రీడా వసతులు పెంచడానికి కృషి చేస్తామని తెలిపారు.శాసనమండలి సభ్యులు ఇసాక్ బాషా మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను యువతను క్రీడలలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ స్టేడియంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు, కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ 25 జిల్లాల నుండి 1000 మంది క్రీడాకారులు 100 మంది క్రీడా నిర్వాహకులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నారన్నారు. తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, నంద్యాల కార్యదర్శి సర్దార్, మాస్టర్లు ఫర్హాతుల్లా, మహబూబ్ బాషా ల నిర్వహణలో ఏర్పాటుచేసిన వివిధ వయస్సు కేటగిరీలు వెయిట్ కేటగిరీలలో అతిథులు పోటీలను లాంచనంగా ప్రారంభించి, క్రీడాకారులు తలపడడం తిలకించారు. విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కాటన్ బోర్డు మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్,పాన్ షావలి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్, ప్రముఖ టైక్వాండో క్రీడాకారులు నాగూర్ బాబు, ప్రముఖ టైక్వాండో క్రీడాకారిని భువన , షానవాజ్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర తైక్వాండో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, తదితరులు

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

సిబ్బంది సంక్షేమా నికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు శుక్రవారం జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి క్యాంపు కార్యాలయ ంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుండి వినతులను ఎస్పీ స్వీకరించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది తమ వ్యక్తిగత హెల్త్ మెడికల్, రిక్వెస్ట్ బదిలీలు, ఇతర వ్యక్తిగత కారణాలు,వారి సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. సిబ్బంది మెడికల్ గ్రౌండ్ ఆధారంగా బదిలీలు చేయడం జరుగుతుందని ఎస్పీ వారికీ తెలిపారు. సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు అక్కడికక్కడే తగిన పరిష్కారం చేస్తానని ఎస్‌పి భరోసా కల్పించారు.



సిబ్బంది నుండి సమస్యలు వింటున్న ఎస్పీ

బాల్య వివాహాలను అరికట్టాలి : పిడి

ప్రజాశక్తి - ఆత్మకూరు

బాల్య వివాహాలను అరికట్టేందుకు, ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని నంద్యాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిని లీలావతి అన్నారు. శుక్రవారం నాడు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు అంగన్వాడీ వర్కర్లకు ఆశా వర్కర్లకు గ్రామ మహిళా పోలీసులకు హెల్త్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సుస్థిరత అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. గ్రామాలలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని, మహిళలు పిల్లలు ఆరోగ్యంగా ఉండే విధంగా ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందించాలని అన్నారు. నందికొట్కూరు సిడిపిఓ కోటేశ్వరమ్మ, ఆళ్లగడ్డ సిడిపిఓ తేజస్వి, నంద్యాల జిల్లా ఎస్ బి సి సి కోఆర్డినేటర్ విజయ్ కుమార్, టిబి యూనిట్ సూపర్వైజర్ పెద్ద మస్తానయ్య, హెల్త్ ఎడ్యుకేటర్లు మల్లికార్జున, ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ్ కుమారి, దేవ జయమ్మ, సూర్య కుమారి, తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆక్రమణలకు గురైె ఉన్న నిర్మాణాలను నోటీసు ఇచ్చిన తొలగించకుండా ఉన్న యజమానులకు మరోసారి చెప్పి రెండు రోజుల్లో ఆక్రమణ తొలగింపులకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మునిసిపల్ చైర్పర్సన్ మా బన్నీసా, మునిసిపల్ కమిషనర్ సి. రవి చంద్రారెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ రమణ మూర్తి, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. అంకిరెడ్డి, మునిసిపల్ డిఈలు జయభారత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మధు, శానిటరీ ఇన్స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ హెడ్స్‌తో కలిసి వార్డు సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్‌క్రోచ్మెంట్స్, డిబ్రిస్ క్లీనింగ్ డ్రైన్స్ పైన అక్రమ నిర్మాణాలు, అక్రమ కట్టడాలు 2 రోజుల సమయం ఇచ్చి కూడా తొలగించుకొని షాప్‌ల వారికి ఇంటి యజమానులకు మరో రెండు రోజుల్లో తొలగించుకొవాలని సిబ్బందిని అదేశించారు.

అన్ని హంగులతో డోన్ ప్రభుత్వ వైద్యశాల

- అందుబాటులో వైద్యులు-పరికరాలు-మందులు

-మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

డోన్ ప్రభుత్వ వైద్యశాలలో ప్రయివేటుకు దీటుగా అన్ని వసతులు కల్పించామని డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. శుక్రవారం ఆయన డోన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్‌రెడ్డి సహకారంతో అదనంగా రూ.55 లక్షలు కేటాయించి వైద్యులు, కావల్సిన పరికరాలను సమకూర్చినట్లు తెలిపారు. రోజుకు 500 మంది ఓపి వచ్చినా వైద్యం చేసి అన్నిరకాల మందులు ఇచ్చే ఏర్పాటు చేశామన్నారు. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులకు అన్ని రకాల రోజులకు వైద్యం చేయడానికి కావాల్సి 14 రకాల వైద్యులను రిక్రూట్ చేశామని వివరించారు. అత్యవసర సమయాల్లో ఒకేసారి 100 మందికి ఆక్సిజన్ అందించే బెడ్స్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు.

వైద్యుల వివరాలు: డాక్టర్ ఎస్ఎండి హనీఫ్(పీడియాట్రీషన్), డాక్టర్ బి.రమ్యశిల్ప(గైనకాలజిస్ట్) , డాక్టర్ ఎస్.సుంకన్న (గైనకాలజిస్ట్), డాక్టర్ తాజాముల్ హుస్సేన్ (జనరల్ సర్జన్), డాక్టర్ ఎస్.రాంబాబు (అనిస్తీసియా), డాక్టర్ పి. జార్జ్ (ఇఎన్‌టి), డాక్టర్ జి.పావని (డెర్మటాలజిస్ట్), డాక్టర్ కె.శ్రీధర్‌బాబు(పాథలిజిస్టు), డాక్టర్ ఎస్.గౌస్ అహ్మద్‌పీర్ (ఆర్థోపెడిక్), డాక్టర్ ఎం.రాజశేఖర్ (అనస్తీసియా), డాక్టర్ డిఆర్‌కె.రెడ్డి (జనరల్ పిజీషియన్), డాక్టర్ పి.యమున కుమారి(డెంటిస్ట్), డాక్టర్ ఎం.కుసుమ(డెంటిస్ట్), డాక్టర్ కె.హేమంత్‌కుమార్ (ఆప్తమాలజిస్ట్) నిత్యం అందుబాటులో ఉంటారని వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కోట్రికె హరికిషన్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హాస్పిటల్ సూపరిన్‌టెన్‌డెండ్ డాక్టర్ ఎస్ఎండి.హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే తనిఖీ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల పట్టణంలోని వివిధ పట్టణ ఆరోగ్య కేంద్రాల హరిజనవాడ, యన్‌జిఓ కాలనీల పరిధిలో జరుగుతున్న కుష్టు వ్యాధి గుర్తింపు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని వైద్యఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న ఆశాలకు పలు సూచనలు చేశారు. ఏ ఒక్క కుష్టు సోకినా వక్తిని వదల కుండా గుర్తించి చికిత్స అందేలా చూడాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి ఇంటినందువు న్న అందరిని పరీక్ష చేయాలనీ ఆదేశించారు. సర్వేలో ఏరకమైన చర్మ వ్యాధులు వున్నా వారిని అయినా అనుమానిత కేసులుగా గుర్తించి ఏ రోజుకు ఆరోజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించి డాక్టర్ చేత పరీక్షా చేయించి కుష్టు కేసు అవునా,కాదా నిర్ధారించాలన్నారు. కుష్టు వ్యాధి కేసులు ఐతే ఆ వ్యక్తుల సమాచారం, అనుమానిత కేసుల జాబితా కూడా రోజువారీగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రములలో ఉంచాలని రోజు వారి రిపోర్ట్‌లో పై అధికారులకు పంపాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు డాక్టర్ మల్లికార్జున రెడ్డి, డాక్టర్ సునీత, విజయకుమార్, పారామెడికల్ అధికారి వై గంగాధర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ పారామెడికల్ అధికారి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందాలన్నదే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో శాసనసభ్యులు గంగుల బిజేంద్రరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మండలంలో ఆయా శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి సంబంధిత అధికారులు సర్వసభ్య సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో జగనన్న గృహ నిర్మాణాలపై అధికారులు దృష్టి సారించి గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. గడపగడప కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో తాను పర్యటిస్తున్నానని, సమస్యలు మా దృష్టికి వస్తున్నాయని త్వరగా పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో మండలంలోని గ్రామాలలో సంక్షేమ అభివృద్ధికి సంబంధించి నిధులు మంజూరు అయ్యాయని పూర్తి చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. స్థానిక గ్రామ సచివాలయ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు అందరూ కలిసికట్టుగా పనిచేసి ఎక్కడైనా సమస్యలు ఉంటే పరిష్కరించి ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేలా కృషి చేయాలన్నారు. ఈ సర్వసభ్య సమావేశంలో ఎంపిడివో సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎన్నికల తహసిల్దార్ రవీంద్ర ప్రసాద్, ఉప మండల అధ్యక్షులు నాసారి ప్రసాద్, కొలిమి దాదాపీర్, జడ్పిటిసి లక్ష్మీదేవమ్మ, గృహ నిర్మాణ శాఖ డిఈ నాగరాజు, ఏఈ నరసింహ, ఉపాధి ఏపీఓగణేష్, ట్రాన్స్ కో ఏఈ కంబగిరి, ఎంఈఓ శోభా వివేకవతి, పంచాయతీ రాజ్ ఏఈ కమాల్ భాష, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామకష్ణనాయక్, వ్యవసాయ శాఖ ఏఈ కిషోర్ రెడ్డి, కెసి కెనాల్ ఏఈ రమేష్, వసతి గృహ వార్డెన్లు అబ్దుల్ ఖాదర్, సురేష్, వెలుగు ఏపిఎం రామశేఖర్ రెడ్డితో పాటు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

నేటి నుండి నంద్యాలలో జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు 51వ జాతీయ స్థాయి మహిళా సీనియర్ హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం కానున్నాయని పోటీల కన్వీనర్ నిమ్మకాయల సుధాకర్,కన్వీనర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 26 రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారులు పోటీపడుతున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఎస్డిఆర్ వరల్డ్ స్కూల్, రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో క్రీడాకారులకు వసతి కల్పించినట్లు తెలిపారు. పోటీలు లీగ్ కం నాకౌట్ పద్ధతిని నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ,ఎమ్మెల్యేశిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి,ఎమ్మెల్సీ ఇషాక్ బాషా,హ్యాండ్ బాల్ ఫెడరేషన్ అధికారులు,వివిధ రాష్ట్రాలను వచ్చిన అధికారులు తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. పోటీల విజయవంతానికి కృషి చేయాలని వారు కోరారు.

సామాజిక తనిఖీపై గ్రామసభలు

ప్రజాశక్తి - రుద్రవరం

ఉపాధి హామీ పనులపై 16వ సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి మధుసూదనరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 1-4-2020 నుంచి 31-3-2021, 1-4-2021 నుంచి 31-3-2022 వరకు రెండు సంవత్సరాలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన హౌసింగ్ ,వెటర్నరీ ,స్కూల్ ఎడ్యుకేషన్, పిఆర్, ఫారెస్ట్, మొదలగు శాఖలో సమన్వయ నిధులు ఖర్చులపై 15, 16 సామాజిక తనిఖీ ఈనెల 24 నుంచి 29 వరకు 20 గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలకు అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు గ్రామ వాలంటీర్లకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ల పోస్టులు భర్తీ కోసం దరఖాస్తు వారు శనివారం నాడు మధ్యాహ్నం రెండు గంటలకు ఆత్మకూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఇంటర్వ్యూలు హాజరయ్యేటప్పుడు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను కూడా తీసుకొని రావాలని ఆయన తెలిపారు.

ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎన్నికైన

గంధం వీర రాఘవరెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి - రుద్రవరం

ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గ ఎన్నికైన రుద్రవరం మండలం వైఎస్ఆర్పిపి సీనియర్ నాయకుడు గంధం వీర రాఘవరెడ్డిని ఆయన స్వగృహంలో శుక్రవారం వైయస్సార్సీపి మండల యువనాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రుద్రవరం మండల వైయస్సార్సీపి యువ నాయకులు సింగతల మహేశ్వరరెడ్డి, హరి నారాయణ, డేగాని వెంకటేష్, పవన్, బాల ఈశ్వర్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్, తదితరులు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వైఎస్ఆర్సిపి మండల యువ నాయకుడు హరి నారాయణ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీలో పెద్దాయనగా పిలవబడుతూ పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన గంధం వీర రాఘవరెడ్డి సేవలను గుర్తించి ఆయనకు ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్నిక చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలను వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాయకులు

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఈనెల 27,28వ తేదీల్లో బేతంచెర్లలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కొత్తపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, రాజేష్ ఉపాధ్యక్షులు నరసింహ సహాయ కార్యదర్శి ప్రసాద్‌లు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం పేదల కోసం అనేక ఉద్యమాలు చేస్తుందని అన్నారు. గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం, రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాటంలో భుజం భుజం కలిసి పోరాడిందని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిరంతరం పోరాడుతున్న సంఘం వ్యవసాయ కార్మిక సంఘం అని అన్నారు. మహాసభలకు జిల్లాలోని వ్యవసాయ కూలీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థి గురునాథ్ రెడ్డి ఎంపికయ్యాడు. ఈనెల 24వ తేదీన కర్నూల్ డిఎస్ఎ క్రీడా ప్రాంగణంలో జరిగిన రాష్ట్ర ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ కర్నూల్, నంద్యాల ఉమ్మడి జిల్లాల యోగ ఎంపిక పోటీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గురునాథ్ రెడ్డి ప్రతిభ కనబరచి సిల్వర్ మెడల్ గెలిచి, రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక అయ్యాడు. విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మమ్మ, ఉపాధ్యాయుల బృందం విద్యార్థినితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు బి.బాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, దస్తగిరి రెడ్డి, రాణి రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ రెగ్యులేటర్ నుంచి శవం వెలికితీత

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద లభ్యమైన గుర్తు తెలియని శవాన్ని శుక్రవారం పోతులపాడు గ్రామపంచాయతీ సహకారంతో పోలీసులు వెలికి తీయించారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మతదేహం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్ల వద్ద స్థానికులు గమనించారు. పోలీసులు వివరణ అడగగా గుర్తుతెలియని వ్యక్తిగా పోస్ట్ మార్ట్ కు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగాకేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డోన్‌కు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నుండి డోనుకు ఆర్టీసీ బస్సు పునరుద్ధరించాలని లావణ్య, మహిళా మండలి అధ్యక్షురాలు రోజా రమణి కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డైలీ యువర్ డిఎం ప్రోగ్రాంను డిపో మేనేజర్ రవి కిషోర్ నిర్వహించారు. పసుపల గ్రామ ప్రజల తరపున లావణ్య మహిళా మండలి అధ్యక్షురాలు రోజా రమణి డిఎం రవి కిషోర్‌కు వినతి పత్రం ఇచ్చారు. డోన్ రెవిన్యూ డివిజన్ కావడంతో బనగానపల్లె నుండి డోన్ కు వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, డోన్ కు బస్సు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బనగానపల్లె నుండి డోన్ కు ఆర్టీసీ బస్సును నడపాలని కోరారు.

పంట నమోదు రసీదుల పంపిణీ

ప్రజాశక్తి - మిడుతూరు

మండలంలోని తిమ్మాపురం గ్రామములో ఖరీఫ్ లో రైతులు వారు వేసిన పంటలను ఈ పంటలో నమోదు చేసుకున్న రైతులకి పంట నమోదు రసీదులను నందికొట్కూరు శాసనసభ్యులు తోగూరు ఆర్థర్ రైతులకి అందజేశారు. శుక్రవారం ఆయన తిమ్మాపురంలో గడపగడప కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పీరు నాయక్, మండల రెవిన్యూ అధికారి సిరాజుద్దీన్, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరం కావాలి

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

దేశంలో ఉన్న యువత చెడు వ్యసనాలకు దూరం కావాలని శ్రీశైలం పీఠాధిపతి చిన్న సిద్ధా రామా పండితారాధ్య శివస్వామి అన్నారు. కర్ణాటకలోని బెలగౌ జిల్లా ఎడ్యూర్ నుంచి పిఠాధిపతి ప్రారంభించిన మహా పాదయాత్ర శుక్రవారం జూపాడుబంగ్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా స్వామికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. సుమారు 650 కిలోమీటర్లు దూరం వరకు సాగే ఈ పాదయాత్రలో భాగంగా జూపాడుబంగ్లాలో ప్రవేశించిన స్వామి వారి పాదయాత్రకు ప్రజలు స్వాగతం పలికారు. పీఠాధిపతి చిన్న సిద్ధా రామా పండితారాధ్య శివస్వాముల వారు మాట్లాడుతూ శ్రీశైల ధర్మ రక్షణలో భాగంగా శ్రీశైల ఖ్యాతి ప్రపంచానికి చాటుతూ, ప్రకతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మహా పాదయాత్ర సాగుతుందన్నారు.

కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ డాక్టర్ శివ శంకరుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి కుష్టి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. ఎల్‌సిడిసి సర్వే కార్యక్రమంలో భాగంగా అనుమానిత మహిళను పరీక్షించి కుష్ఠు కాదని నిర్ధారణ చేశారు. ఇల్లూరు కొత్తపేట గ్రామంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమంను టంగుటూరు వైద్యధికారి డాక్టర్ శివశంకరుడు పర్యవేక్షించారు. అనంతరం బిసి బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. వసతి గృహ సంరక్షణాధికారి మునిరాజు,ఆరోగ్య పర్యవేక్షకులు కె. మద్దయ్య, బిసి హెచ్ అయ్యమ్మ, ఎంఎల్‌హెచ్‌పి భాను, ఏఎన్ఎం వై. రాణి పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థినీలకు మహిళలపై జరిగే వివిధ రకాల నేరాలపై ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌కు చెందిన శక్తి టీమ్, ఉయ్యాలవాడ ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం అవగాహన కల్పించారు. ఆడపిల్లలపై జరిగే నేరాలు గురించి వాటిపై ఎదుర్కొనే అంశాలు, దిశా యాప్, డయల్ 100 ఫోక్సో యాక్ట్ యాప్ ల గురించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నూర్జహాన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది

గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాగలమర్రి

అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయమని ఆళ్లగడ్డ శాసన సభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆవులపల్లె,రాంపల్లె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు లబ్దిపొందిన వివరాల పత్రాలను అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు,వర్గాలకు,కులమతాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామగ్రామాన నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని తిరిగి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి బాబులాల్,మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి,ఎంపిపి వీరభద్రుడు,సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి,ఎంపిటీసిలు బేబమ్మ, పత్తినారాయణ, లక్ష్మిరెడ్డి, నరసింహులు,వక్కీర్‌రెడ్డి,రమణయ్య,వెంకటనారాయణ,శ్రీరాములు,రాంపల్లె రఘునాథ రెడ్డి, రామకృష్ణ, సుబ్బరాయుడు,నరసింహ,మహబూబ్‌వలి, ఉపసర్పంచ్ సోహెల్, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రతాప్‌సింగ్,సాగు నీటి సంఘం అధ్యక్షుడు అధ్యక్షులు శేసు రమేష్,నాయకులు నాగేశ్వర రావు యాదవ్,నారాయణరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి,జగదీశ్వర రెడ్డి పంచాయతి కార్యదర్శి సబియా తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** గ్రామాల అభివృద్దే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు మండలంలోని సిద్దాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన వచ్చిన సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు మన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ఆ ఇంటిలో ప్రభుత్వం ద్వారా లబ్ది పొందిన వివరాలను వారికి వివరించడంతోపాటు ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకొని రావాలని, సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లేటి సభ్యుడు శివ శంకర్ రెడ్డి, ఎంపీడీవో మోహన్ కుమార్, ఎంఆర్ఓ ఆనంద్ రాముడు, వైఎస్ఆర్‌సిపి నాయకులు రాజమోహన్ రెడ్డి, కొట్ల నాగేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **నంద్యాల అర్బన్ :** నంద్యాల పట్టణంలోని ఒకటవ వార్డు సంగపేట పటాన్ పేట లో 62 వరోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిస, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, పాంశావళి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్స్ మునయ్య, కన్నమ్మ, వైసిపి నాయకులు ఎర్రన్న బాబు, శేఖర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


గడపగడపకులో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వక్తలు

శాంతి రామ్ కళాశాలలో
'ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్‌పై వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని శాంతి రామ్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశం పై వర్క్ షాప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రమణ్యం ప్రారంభించారు. అకడమిక్‌తో పాటు భవిష్యత్తులో విద్యార్థులు రాణించాలంటే ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగ పడతాయి అని అన్నారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా కుమార్, సమన్వయ కర్త గా రియాజ్, కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి పరూక్ పాల్గొన్నారు.

సిఐటియు మండల కమిటీలు ఎన్నిక

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూర్ మండల నూతన కమిటీల ఎన్నిక శుక్రవారం సిఐటియు మండల అధ్యక్షురాలు ఆరు జయ అధ్యక్షతన జరిగింది. పట్టణ అధ్యక్షురాలుగా ఆరు జయ, కార్యదర్శిగా గోపాలకృష్ణ, సిఐటియు రూరల్ అధ్యక్షులుగా ఆంజనేయులు, కార్యదర్శిగా నాగన్న, ఉపాధ్యక్షులుగా పి మదర్ బీ, శైలజతో పాటు 36 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కే భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్న కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలన్నారు. కనీస వేతనాలు అమలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. మండలంలో నెలకొన్న అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీలు పోరాటాలు చేయాలని వారు కోరారు.


మాట్లాడుతున్న
సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. భాస్కర్ రెడ్డి

వన్యప్రాణులను కాపాడుకోవడం బాధ్యత

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

వన్యప్రాణులను కాపాడు కోవడం మనందరి బాధ్యత అని బండి ఆత్మకూరు రేంజ్ ఆఫీసర్ నసీర్ జ తెలిపారు.

శుక్రవారం మండలంలోని అడవి సమీప గ్రామాలైన నారాయణ పురం జిసి పాలెం లింగాపురం చెంచు గుడాలైన నారపరెడ్డి కుంట నెమల్లకుంట గ్రామాల్లో వన్యప్రాణులను గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు డిజిటల్ ప్రచార సాధనం ద్వారా ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఫ్ ఎస్ ఓ లు తేజ రవీంద్ర నాయక్ మాట్లాడారు.

మంగమ్మ ఆత్మహత్యాయత్నానికి కారకులను శిక్షించాలి : టిడిపి

ప్రజాశక్తి - నందికొట్కూరు/పగిడ్యాల

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నటువంటి పుట్ట మంగమ్మ ను నందికొట్కూరు నియోజకవర్గం అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి పగిడ్యాల మండల టిడిపి కన్వీనర్ పాలచారి మహేశ్వర్ రెడ్డిలు పరామర్శించినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన ఇంటి పట్టా ఇవ్వండి అని అడిగినందుకు మంగమ్మ అనే మహిళ పైన అక్రమ కేసులు బనాయించడం దారుణం అన్నారు. తప్పుడు కేసులు బనాయించి మానసిక క్షోభకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని అన్నారు. ఈ సమస్యకు కారణమైనటువంటి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి పై అతని అనుచరుల పైన చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


చికిత్స పొందుతున్న మంగమ్మ

కార్తీక మాసంలో
మల్లన్న రాబడి రూ. 30 కోట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

ఈ సంవత్సరం కార్తీకమాసంలో శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దేవస్థానానికి రూ.30 ,89,27,503/- రాబడి లభించినట్లుగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న శుక్రవారం నాడు తెలిపారు. గత సంవత్సరం కార్తీకమాసంలో మొత్తం రాబడి రూ. 19,86,53,778 రాబడి లభించిందని, మొత్తం మీద గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 55.51 శాతం అధికంగా లభించిందన్నారు.

నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలి


లేవటం పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి 25 బీపీఎల్ 3

ప్రజాశక్తి - బనగానపల్లె

లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణీత సమయంలో గృహ నిర్మాణం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల అధికారి, బనగానపల్లె నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలుకూరు గ్రామంలో ఒకటి, రెండు సచివాలయాల పరిధిలోని ఇళ్ల స్థలాల ను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమల అధికారి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం గృహ నిర్మాణాలకు తగిన మార్గదర్శకాలు ప్రకటించిందని వాటి ప్రకారం త్వరితగతిన నిర్మించుకోవాలని సూచించారు. ప్రభుత్వం తరపున సహకారం అందేలా తాము సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి,ఇన్ హౌసింగ్ ఇన్స్పెక్టర్ రామచంద్రుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దస్తగిరి, శ్రీకాంత్, సచివాలయ సిబ్బంది వీఆర్వో రమేష్ చౌదరి,పుల్లారెడ్డి,వడ్డే వెంకటేష్, రాంబాబు,గజ్జల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు చర్యలు తీసుకోండి

- జిల్లా గ్రామ పంచాయతి అధికారి శ్రీనివాసులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండల పరిధిలో గ్రామాలలో డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని నంద్యాల జిల్లా గ్రామ పంచాయతి అధికారి శ్రీనివాసులు శుక్రవారం ఆన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు అన్ని గ్రామ సచివాలయాల పనిచేయుచున్న విలేజ్ హెల్త్ సెక్రెటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఈ సమావేశా నికి ముఖ్యఅతిథిగా నంద్యాల జిల్లా గ్రామ పంచాయతి అధికారి శ్రీనివాసులు ఎంపీడీవో సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌డిజి సర్వే, ఎపి ఎఎన్ఎం, ఐడిఎస్‌పి యాప్ డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి తాహిర్ హుస్సేన్,హాజరైన విలేజ్ హెల్త్ సెక్రెటరీస్ రామేశ్వరమ్మ, సునంద, మాధవి, నిర్మల,ధనలక్ష్మి దేవి, శివ నాగ లక్ష్మి, జయలలిత, కమలా బాయ్, ఉమా మహేశ్వరి,ఉమా మహేశ్వరమ్మ,రాజేశ్వరి, శంకరమ్మ, రామ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రామ పంచాయతి అధికారి

పొదుపు అలవాటు చేసుకోవాలి : జెఎస్ఎస్

ప్రజాశక్తి - బనగానపల్లె

విద్యార్థులు చిన్నతనం నుండే పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానందచారి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బీరవోలు గ్రామంలోని ఎస్టి కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో గుంటూరుకి చెందిన కవయిత్రి బి.శివ నాగేశ్వరి సహకారంతో పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం పొదుపు విశిష్టతపై విద్యార్థులకు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బ్రహ్మానందచారి మాట్లాడుతూ చిన్ననాటి నుండి పొదుపు చేయడం అలవాటు చేసుకోలన్నారు. నేటి పొదుపు రేపటి భవిష్యత్తుకు బంగారు బాట అన్నారు. డబ్బు పొదుపుతో పాటు విద్యుత్, నీరు, పెట్రోలు, ఇంధనం పొదుపు చేస్తే దేశాభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. ధనం పొదుపు చేస్తే అత్యవసర పరిస్థితుల్లో వచ్చే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.వెంకటరెడ్డి ఉపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, వెంకటలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ బి. భార్గవి, అంగన్వాడి టీచర్ మద్దమ్మ,ఆశా వర్కర్ శాంతి,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న బహ్మానంద ఆచారి

లింగ వివక్షను నిర్మూలిద్దాం : ఎంపిపి

ప్రజాశక్తి - బేతంచర్ల

లింగ వివక్షను నిర్మూలిద్దాం బాల్య వివాహాలను వ్యతిరేకిద్దామని బేతంచెర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రియతమ్ రెడ్డి అన్నారు. బేతంచెర్ల మండల కేంద్రంలోని వెలుగు ఆఫీసు నందు ఈఓఆర్డి రంగనాయక్, ఏబీఎన్ లింగమయ్య అధ్యక్షతన లింగ వివక్ష బాల్య వివాహాలు లైంగిక దాడులు శిక్షలు అనే అంశంపై శుక్రవారం నాడు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగ వివక్ష చూపడం సరైనది కాదని వారన్నారు. బేతంచెర్ల సీఐ ప్రియతమ రెడ్డి మాట్లాడుతూ గృహహింస ఫోక్సో చట్టం గురించి మహిళలకు అర్థమయ్యే విధంగా చెప్పడం జరిగింది. జడ్పిటిసి శివలక్ష్మి మహిళా మండలి సమాఖ్య అధ్యక్షురాలు లక్షిదేవమ్మ మాట్లాడుతూ స్త్రీలకు సమానత్వం కావాలని రాజ్యాంగంలో లిఖించబడిన రీతిగా ఈనాడు సమాజంలో స్త్రీని గౌరవించడం లేదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసులు అగ్రికల్చర్ ఆఫీసర్ కిరణ్ కుమార్ శ్రీదేవి అంగన్వాడీలు లక్ష్మీదేవి గుల్జార్బి, రామ తులసి ఆశ వర్కర్లు సరోజ సుజాత తదితరులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** ప్రజల్లో లింగ వివక్షకు స్వస్తి పలకాలని ఎంపీడీవో వాసుదేవ గుప్తా తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ భవనం నందు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని శాఖల అధికారులతో లింగ వివక్ష చూపకూడదు అనే అంశంపై సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులతో ఎంపీడీవో వాసుదేవ గుప్తా లింగ వివక్ష శుభమని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష చూపరాదని లింగ వివక్షకు ఇక ముగింపు పలకాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పోలీస్ రెవెన్యూ పంచాయతీరాజ్ ఆరోగ్య సిబ్బంది ఫారెస్ట్ అన్ని శాఖలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఆఫీసర్లు, వెలుగు సిబ్బంది, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి

ముదిగేడు గ్రామ రోడ్డును బాగు చేయండి

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని ముదిగేడు గ్రామంలో ఒక పర్లాంగ్ దూరంలో ఆర్ అండ్ బి రోడ్డు ఎనిమిది గుంతలు పడినవని. వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, ముదిగేడు గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా గుంతలు పూడ్చడం లేదని ఈమధ్య రెండు మూడుసార్లు ట్రాక్టర్లు ఇరుక్కొని పోయి గంటల తరబడి ప్రయాణానికి అంతరాయం కలిగిందని ఆ గ్రామ ప్రజలు, ప్రయాణికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతలు పూడ్చి ప్రయాణాన్ని సులభతరం చేయాలని ముదిగేడు గ్రామ ప్రజలు, వాహన చోధకులు, ఇతర గ్రామాల వారు కోరుతున్నారు.


ఇరుక్కుపోయిన ట్రాక్టర్

డ్రైనేజీ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోనే మున్సిపాలిటీ పరిధిలో 26 వార్డు హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా చేపడుతున్న డ్రైనేజ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ దాసీ సుధాకర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. హౌసింగ్ బోర్డు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కాలనీవాసులు విజ్ఞప్తి మేరకు రూ.6 లక్షల నిధులతో డ్రైనేజీ వ్యవస్థను సరి చేస్తున్నట్లు చైర్మన్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మందడి వాణి మాట్లాడుతూ వార్డులో సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందడి రవీంద్రారెడ్డి, కౌన్సిలర్ రజిని కుమార్ రెడ్డి, లాలూ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను సందర్శించిన సిఎండి

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని మేకల బండలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని విద్యుత్ శాఖ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ రావు శుక్రవారం పరిశీలించారు. విద్యుత్ లైన్లు ఏర్పాటు అడిగి తెలుసుకున్నారు. కాలనీకి అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు వై కాపా నాయకులు సూర్య నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు,మేకల సుబ్బారాయుడు చెప్పారు. పాణ్యం ఏ.ఈ.పుల్లయ్య పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలి

శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లాలో క్రీడలను మరింతగా అభివృద్ధి చేసేలా వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ వ్యాయామ విద్యా పితామహుడు హరికో బిక్ జయంతి సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవాన్ని శ్రీ గురు రాజ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో షేక్షావల్లి రెడ్డి కేక్ కట్ చేశారు.

ఈ సందర్భంగా షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ క్రీడలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవని చెప్పారు. క్రీడల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉందని సూచించారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనేలా చూడాల్సిన బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదే అన్నారు. క్రీడలను ప్రోత్సహించేలా వ్యాయామ ఉపాధ్యాయులు అహర్నిశలు పాటుపడాలని చెప్పారు.


హరికో బిక్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

సమయపాలన పాటించకుంటే చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పాములపాడు

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని పాములపాడు ఎంపీడీవో నాగ శివ లీల అన్నారు శుక్రవారం నాడు పంచాయతీ కార్యదర్శులు సమావేశం ఏర్పాటు చేశారు ఆమె మాట్లాడుతూ సచివాల సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు ఉంటాయని ఆమె హెచ్చరించారు సచివాల సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులు సమావేశం ఏర్పాటు చేసి సమయపాలన పాటించే విధంగా సూచనలు చేయాలని అన్నారు సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులు కీలకంగా వ్యవహరించి బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలన్నారు ఉదయం 10:30 కల్లా సిబ్బంది అందరూ హాజరు కావాలన్నారు శుక్రవారంనాడు రుద్రవరం గ్రామంలో టయానికి సచివాలయానికి హాజరుకాని సిబ్బందికి మెమోలు ఇచ్చారు అనంతరం ఈఓఆర్డి సుమిత్రమ్మ మాట్లాడుతూ గ్రామాలలో శానిటేషన్ చేయించాలన్నారు ఇంటి పనులు వసూలు చేసి పంచాయతీ నిధులు సేకరించాలన్నారు గ్రామాలలో పరిశుభ్రత పాటించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నందికొట్కూరు

అనారోగ్యంతో మృతి చెందిన పట్టణంలో 25వ వార్డుకు చెందిన జిలాన్ బాషా కుటుంబ సభ్యులకు మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ, 8వ వార్డ్ ఇంచార్జి శాలి బాషలు ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను వారు పరామర్శించి, అనంతరం(రబ్బాని గ్రూప్స్) తరుపున మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్బాస్, రియాజ్, చంద్ బాషా, ఇమ్రాన్, వైస్సార్సీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్ పసుల శ్రీనివాసులు నాయుడు, మోహన్ తదిరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - వెలుగోడు

మండల పరిధిలోని మోత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధిపై వైద్యులు జిల్లా వైద్యాధికారిణి ప్రభావతి, టీబి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, టీబి సూపర్వైజర్ రాజు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైద్యులు కృష్ణమూర్తి, ప్రసన్నలక్ష్మి, నాగేశ్వరరావు, శ్రీరాములు, మధుసూదన రెడ్డి, బాల చంద్రుడు, హృషీ కేష్, శ్రీదేవి, శేఖర్ బాబు, కల్పలత తదితర సిబ్బంది నిరుపేదలైన టి. బి. వ్యాధిగ్రస్తులకు 13 మందికి ఆరు నెలల పాటు దత్తత తీసుకొని వారికి కావలసిన నిత్యవసర వస్తువులను అందజేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ యువ నాయకులు మోత్కూరు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

9లోపు పట్టభద్రుల ఓటరుకు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - సంజామల

గ్రాడ్యుయేషన్ పూర్తి అయినవారు రాయలసీమ పట్టభద్రుల ఓటర్ నమోదుకు మరోమారు అవకాశము వచ్చిందని, డిసెంబర్ 9వ తేదీ లోపల నమోదు చేసుకోవాలని తహశీల్దార్ మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు

చదువుతో పాటు క్రీడాలలో రాణించాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

చదువుతో పాటు క్రీడలలో రానించాలని ఉమ్మడి జిల్లా ఖోఖో చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి విద్యార్థు లకు సూచించారు. శుక్రవారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాల్ బ్యాట్మెంట్ బ్యాట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడారు. జిల్లా స్పోర్స్ కో ఆర్డినేట్ రాజు,అఖిలేష్, సర్పంచు పెరుబాళ్ళ శేషన్న,పిడిలు రవి,కృష్ణ ,రాగన్న, పీతాంబరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


బాల్, బ్యాట్మెంట్ బ్యాట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నాణ్యమైన భోజనాన్ని అందించండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పిఓపిఆర్డి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మాయలూరు హైస్కూల్లో శుక్రవారం నాడు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని విద్యార్థుల హాజరు శాతం పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి వెలుగోడు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎండి డాక్టర్ జి రమేష్ వారి సౌజన్యంతో ఈ నెల 27వ తేదీ అనగా ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు జి రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి మక్బుల్ బాష, కార్యనిర్వాహక సభ్యులు జయరామిరెడ్డి, సుల్తాన్ మొహిద్దీన్‌లు శుక్రవారం తెలిపారు. మండల ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకొవాలని వారు కోరారు.

ఎలక్ట్రికల్ పరికరాలు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీ శైల క్షేత్ర దేవస్థానానికి శుక్రవారం నాడు హైదరాబాదుకు చెందిన కాకతీయ ఎనర్జీ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కంపెనీకి చెందిన పి ఆర్ లక్ష్మణరావు దేవస్థానానికి ఎలక్ట్రికల్ పరికరాలు విరాళంగా అందజేశారు. అవుట్ డోర్ లైటింగ్కు ఉపయోగించే ఆటోమేటిక్ స్విచులను అందజేయడం జరిగింది. సదరు ఎలక్ట్రికల్ సామాగ్రిని డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇంజనీర్ మల్లికార్జున ప్రసాద్కు అందజేయడం జరిగింది. ఈ పరికరాల విలువ రూ. 1,42,000/- లు విలువ ఉంటుందని దాత తెలిపారు. ఈ విధంగా విరాళం అందజేసిన దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేసినట్లుగా దేవస్థానం అధికారులు తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని బిసి వసతి గృహంలో ఉన్న విద్యార్థు లకు దుప్పట్లను శుక్రవారం వసతి గృహ సంక్షేమ అధికారి సురేష్ అందజేశారు. 135 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చిన దుప్పట్లను (బెడ్ షీట్స్, కార్పెట్స్) ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డెన్ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన దృశ్యం